http://www.agnidharanews.com

# అగ్నిధార

బుధవారం 10 సెప్టెంబర్ 2025

నిజాల నిప్పు కణిక

ఎడిటర్: చేగొండ రవి కుమార్ యాదవ్

పేజీలు : 5    వెల : 5/-

Published from Peddapalli Ciculated by Hyderabad, , , Sangareddy, jagityala, Rangareddy, Khammam,Medchal Medak Siddipet, Nalgonda, , warangal, Nizamabad



## విలేకరులు కావలెను

ప్రజా గళాన్ని బలంగా వినిపిస్తూ.. అవినీతిపై సమరాన్ని సాగిస్తున్న అగ్నిధార తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల వారికి అవకాశం కలదు. అన్ని జిల్లాలు, డివిజన్లు, మున్సిపల్ మరియు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను.

ఆసక్తి కలిగినవారు సంప్రదించగలరు

సెల్ : 80088 17828




## డీఎంకేకు నిద్రలేకుండా చేస్తున్న విజయ్!

- తమిళ రాజకీయాల్లో సరికొత్త సంచలనం దిశగా సినీ హీరో విజయ్ అడుగులేస్తున్నారు
- మీట్ ది పీపుల్ పేరిట ఈ శనివారం నుంచి రాష్ట్ర పర్యటనలు
- తన పర్యటనల రిత్యా అవసరమైన భద్రత కల్పించాలంటూ విజ్ఞప్తి
- తన రాజకీయ పార్టీ తమిళగ వెట్రి కళగంకు బలమైన పునాది వేయడం మాత్రమే కాదు
- 2026 అసెంబ్లీ ఎన్నికల్లో విజయంతో అధికార కైవసమే లక్ష్యంగా విజయ్ అడుగులేయబోతున్నారు

## ఇంటిగ్రేటెడ్ పాఠశాలలకు ఆర్థిక సాయం

# అందించండి

- కేంద్రమంత్రిని కోరిన సీఎం రేవంత్‌రెడ్డి
- రాష్ట్రంలో భారీ వర్షాల వల్ల సంభవించిన నష్టంపై ఆర్థికమంత్రికి నివేదిక అందజేత
- రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలకు ఆర్థిక సాయం అందించాలి
- సీఎం వెంట ఎంపీలు మల్లు రవి, చామల కిరణ్ కుమార్‌రెడ్డి, కె.రఘువీర్‌రెడ్డి, బలరాం నాయక్ తదితరులు ఉన్నారు.



ఢిల్లీ

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దేశ రాజధాని ఢిల్లీలో మంగళవారం) పర్యటిస్తున్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో సమావేశం అయ్యారు సీఎం రేవంత్‌రెడ్డి. ఈ భేటీలో పలు కీలక అంశాలపై చర్చించారు. ఇటీవల తెలంగాణ రాష్ట్రంలో కురిసిన భారీ వర్షాలు వరదల వల్ల సంభవించిన నష్టానికి సంబంధించి ప్రాథమిక అంచనాలను ఇప్పటికే కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్‌కి ఇచ్చింది రేవంత్‌రెడ్డి ప్రభుత్వం. తెలంగాణలో చేపడుతున్న ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ఏర్పాటుకు ప్రత్యేక నిధులతో పాటు, రాష్ట్రానికి ఆర్థిక సాయం అందించాలని కోరారు సీఎం రేవంత్ రెడ్డి. ఎంపీలు చామల కిరణ్ కుమార్‌రెడ్డి, మల్లు రవి, బలరాం నాయక్, సురేష్ షెట్కార్ పాల్గొన్నారు.




## పాక్ వంకర బుద్ధి.. ప్రధాని, ఆర్మీ చీఫ్ మధ్య వైరం అంటూ ఫేక్ ప్రచారం

- సామాజిక మాధ్యమాల వేదికగా భారత్‌పై విషం
- భారత ప్రభుత్వానికి వ్యతిరేకంగా కొన్ని అనుకూల ఎక్స్ హ్యాండిల్ల నుంచి ఒకేతరహా ప్రచారం



## ఆశ లేకపోతే.. జీవితమే లేదు

- సీఎం పోస్టుపై డీకే ఆసక్తికర వ్యాఖ్యలు
- సీఎం మార్పు నిర్ణయం పూర్తిగా కాంగ్రెస్ హైకమాండ్‌దే
- హైకమాండ్ నిర్ణయం, ఆదేశాల ప్రకారం ముందుకెళ్తాం

## పార్టీ మారిన 10 మంది

# ఎమ్మెల్యేలు ఏ లింగమో?



- పాలమూరు ఎత్తిపోతలను పడావుబెట్టి..
- రైతుల నోట్లో మట్టి కొడుతున్నది రేవంత్ రెడ్డినే
- బీఆర్ఎస్ నాయకుల మీద కాంగ్రెస్ సర్కార్ అక్రమ కేసులు పెడుతోంది కేటీఆర్
- బీఆర్ఎస్ నాయకులను కాంగ్రెస్ సర్కార్ తీవ్రమైన వేధింపులకు గురి చేస్తుంది
- మండల, గ్రామస్థాయి నాయకులను తీవ్ర మానసిక క్షోభకు గురి చేస్తున్నారు

హైదరాబాద్

పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతలను పడావుబెట్టి.. ఉమ్మడి పాలమూరు జిల్లాను ఎండబెడుతున్నది.. రైతుల నోట్లో మట్టి కొడుతున్నది సీఎం రేవంత్ రెడ్డినే అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. జడ్చర్లలో మాజీ మంత్రులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్‌తో కలిసి కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. ఇవాళ సీఎం రేవంత్ రెడ్డి ఈ 21 నెలలో ఎక్కడ మాట్లాడిన నేను పాలమూరు బిడ్డను.. వెనుకబడ్డ ప్రాంతమైన నల్లమల నుంచి వచ్చిన బిడ్డను.. ఆకలి విలువ తెలిసిన వాన్ని.. రైతు గురించి తెలిసిన వాడిని.. రైతు కుటుంబంలో వచ్చిన వాడిని అని ప్రతి వేదికపైన చెప్పారు. - మిగతా3లో



## ఇదే రిపీట్ అయితే

# మళ్లీ పరీక్ష

- గ్రూప్-1పై తెలంగాణ హైకోర్టు కీలక తీర్పు
- గతంలో ప్రకటించిన జనరల్ ర్యాంకింగ్ లిస్టును రద్దు
- మెయిన్స్ పరీక్షల రీవాల్యూయేషన్‌కు ఆదేశం
- ఒకవేళ రీవాల్యూయేషన్ సాధ్యం కాకపోతే పరీక్షలు మళ్ళీ నిర్వహించాలని స్పష్టం
- అవకతవకలకు తావు లేకుండా వాల్యుయేషన్ చేయాలి
- ఆ తర్వాతే 563 మందిని ఎంపిక చేసి పోస్టింగులు ఇవ్వాలి.




## నేపాల్‌లో సైనిక పాలన?

- యువత హింసాత్మక ఆందోళనలకు దిగొచ్చిన కేపీ శర్మ ఓలీ తన ప్రధాని పదవికి రాజీనామా
- సైన్యం సూచన మేరకే ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.
- ఈ క్రమంలో తనను సురక్షితంగా దేశం దాటించాలనే షరతు మీద ఆయన సైన్యం చెప్పింది చేసినట్లు అక్కడి మీడియా కథనాలు

## భారత ఉపరాష్ట్రపతిగా


# సీపీ రాధాకృష్ణన్



- కూటమి అభ్యర్థిపై గెలుపు
- భారత 17వ ఉప రాష్ట్రపతిగా సీపీ రాధాకృష్ణ ఎన్నిక
- ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ఎన్డీయే అభ్యర్థి.. కూటమి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్ రెడ్డిపై 152 ఓట్ల మెజారిటీతో విజయం
- ఎన్నికల్లో సీపీ రాధాకృష్ణన్‌కు 452 ఓట్లు వచ్చాయి

ఢిల్లీ

భారత 17వ ఉప రాష్ట్రపతిగా సీపీ రాధాకృష్ణ ఎన్నికయ్యారు. ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ఎన్డీయే అభ్యర్థి.. కూటమి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్ రెడ్డిపై విజయం సాధించారు. ఎన్నికల్లో సీపీ రాధాకృష్ణన్‌కు 452 ఓట్లు వచ్చాయి. సుదర్శన్‌రెడ్డిపై 152 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఉప రాష్ట్రపతి ఎన్నికలు మంగళవారం జరిగాయి. ఎన్నికల్లో మొత్తం 767 మంది ఎంపీలు ఓటు వేశారు. ఇందులో లోక్‌సభ, రాజ్యసభ సభ్యులు ఉన్నారు. ఎన్డీయే అభ్యర్థి అయిన సీపీ రాధాకృష్ణన్‌కు 452 ఓట్లు రాగా.. కూటమి అభ్యర్థి - మిగతా3లో



## హిమాచల్‌లో వరదలు.. రూ.1500 కోట్ల తక్షణ సాయం

- రాష్ట్రంలోని వరద ప్రభావిత, కొండచరియలు విరిగిపడిన ప్రాంతాల్లో పరిస్థితులను ఏరియల్ సర్వే
- మృతుల బంధువులకు రూ.2 లక్షల చొప్పున, గాయపడిన వారికి రూ.50 వేల చొప్పున పరిహారం
- ప్రస్తుత విపత్కర పరిస్థితుల్లో రాష్ట్రం వెన్నంటే ఉంటాం
- వరద ప్రభావిత ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల పునరుద్ధరణకు అన్ని విధాలా సాయం చేస్తామని హామీ

## అందరికీ ఆదర్శంగా

# సీఎం రేవంత్ రెడ్డి



- సీఎం ఇల్లు అయితేనేం.. కూల్చేయాల్సిందే..!
- అభివృద్ధి విషయంలో తరతమ భేదాలు చూడకూడదని చెబుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి..
- ఆ మాటను ఆచరించి చూపి అందరికీ ఆదర్శంగా నిలిచారు.
- నాగర్‌కర్నూల్ జిల్లా, వంగూరు మండలంలోని సీఎం స్వగ్రామమైన కొండారెడ్డిపల్లిలో చేపట్టిన 4 లేన్ల రోడ్డు నిర్మాణ పనుల వేళ..
- తన ఇంటి ఇంటి ప్రహరీ అడ్డు రావడంతో మరో ఆలోచన లేకుండా వెంటనే కూల్చేయాలని ఆదేశాలిచ్చి ఆదర్శంగా నిలిచారు

హైదరాబాద్

అభివృద్ధి విషయంలో తరతమ భేదాలు చూడకూడదని చెబుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. ఆ మాటను ఆచరించి చూపి అందరికీ ఆదర్శంగా నిలిచారు. నాగర్‌కర్నూల్ జిల్లా, వంగూరు మండలంలోని సీఎం స్వగ్రామమైన కొండారెడ్డిపల్లిలో చేపట్టిన 4 లేన్ల రోడ్డు నిర్మాణ పనుల వేళ.. తన ఇంటి ఇంటి ప్రహరీ అడ్డు రావడంతో మరో ఆలోచన లేకుండా వెంటనే కూల్చేయాలని ఆదేశాలిచ్చి ఆదర్శంగా నిలిచారు. ఈ రోడ్డు విస్తరణలో భాగంగా గ్రామంలోని మొత్తం 43 ఇళ్లను పాక్షికంగా కూల్చేయాల్సి వచ్చింది. ఈ క్రమంలోనే సీఎం ఆదేశాలతో.. కొండారెడ్డిపల్లిలో రెండు రోజుల క్రితం - మిగతా3లో

# డీఎంకేకు నిద్రలేకుండా చేస్తున్న విజయ్!



విమర్శలు, వ్యంగ్యాస్త్రాలను(ట్రోల్స్‌మీమ్స్) పట్టించుకోకుండా తమిళ రాజకీయాల్లో సరికొత్త సంచలనం దిశగా సినీ హీరో విజయ్ అడుగులేస్తున్నారు. మీట్ ది పీపుల్ పేరిట ఈ శనివారం నుంచి రాష్ట్ర పర్యటనలు చేపట్టను న్నారు. అయితే జనాల్లోకి వెళ్లే క్రమంలో.. తమిళనాడు డీజీపీకి ఆయన ఓ లేఖ రాశారు. తన పర్యటనల రీత్యా అవసరమైన భద్రత కల్పించాలంటూ విజ్ఞప్తి చేశారాయన. ఈ క్రమంలో సంచలన ఆరోపణలకే దిగారాయన. తన రాజకీయ పార్టీ తమిళగ వెట్రి కళగంకు బలమైన పునాది వేయడం మాత్రమే కాదు.. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో విజయంతో అధికార కైవసమే లక్ష్యంగా విజయ్ అడుగులేయబోతున్నారు. సెప్టెంబర్ 13వ తేదీన తిరుచ్చి నుంచి ప్రత్యేక ప్రచార రథం బయల్దేరనుంది. అలా మొత్తం 38 జిల్లాల్లో పర్యటిస్తూ.. ప్రజలతో మమేకం అయ్యేలా కార్యక్రమాలతో (సభలు, సమావేశాలు, ర్యాలీలు, ముఖాముఖి, రౌండ్ టేబుల్ మీటింగ్స్) నిర్వహిస్తుంది. డిసెంబర్ 20వ తేదీన మధురైలో సభ ద్వారా టీవీకే విజయ్ మీట్ ది పీపుల్ పర్యటన ముగియనుంది. అయితే..
టీవీకే చర్యలతో అధికార డీఎంకే నేతలకు నిద్రలేకుండా పోతోందని విజయ్ అంటున్నారు. టీవీకే కేడర్‌పై వరుసగా కేసులు పెట్టడాన్ని ఖండిస్తూ ఓ బహిరంగ ప్రకటన విడుదల చేశారాయన. ఆ పార్టీ కార్యదర్శి ఆనంద్‌తో పాటు తిరుచ్చి పార్టీ విభాగం నేతలపైనా తాజాగా కేసు నమోదు అయ్యింది. అయితే.. ఈ పరిణామంపై విజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. టీవీకేకు అధికారంలో ఉన్నపార్టీ భయపడుతోందా? అని ప్రశ్నించారాయన. డీఎంకే ఇప్పుడు టీవీకే గురించే ఆలోచించడం మొదలుపెట్టింది. 24 గంటలూ అదే ఆలోచనతో ఉంటోంది. ఆ పార్టీ నేతలకు నిద్ర కరువైంది. ఈ క్రమంలోనే పోలీసులపై ఒత్తిడి చేస్తూ కేసులు పెట్టిస్తోంది. కొంపదీసి.. టీవీకేకు డీఎంకే భయపడుతోందా? అని ప్రశ్నించారాయన.

తమిళనాడు రాజకీయాల్లో తారలకు ప్రజలు అధికారం కట్టబెట్టడం కొత్తేం కాదు. శివాజీ గణేషన్, విజయ్‌కాంత్, శరత్‌కుమార్, కమల్‌హాసన్.. ఇలా ఎందరో తమ అదృష్టాన్ని పరీక్షించుకున్నారు. రజినీకాంత్ లాంటి భారీ ఫ్యాన్‌ఫాలోయింగ్ ఉన్న తార ఆ దిశగా అడుగు వేసినట్లే వేసి.. వెనక్కి వెళ్లిపోయారు. అయితే.. ఎంజీఆర్, జయలలిత ఏకంగా ముఖ్యమంత్రులు అయ్యారు. వీళ్లందరితో పోల్చుకుంటే.. విజయ్‌కు ఇప్పుడున్న మాస్ ఫాలోయింగ్ చాలాచాలా ఎక్కువే. ఆ అభిమానాన్నే ఓటు బ్యాంకుగా మార్చుకోవాలని విజయ్ ఉవ్విళ్లూరుతున్నారు. తమిళనాడులో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్న వేళ, విజయ్ చేపట్టిన "మీట్ ది పీపుల్" పర్యటన రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. విజయ్ గత ఏడాది రాజకీయాల్లోకి అడుగుపెట్టి, రెండు మానాడు(మహానాడు)లను విజయవంతంగా నిర్వహించారు. మదురైలో జరిగిన రెండో మహానాడులో ప్రజల మధ్యకి వస్తున్నట్టు ప్రకటించి.. రాజకీయ ప్రత్యర్థి డీఎంకే, సైద్ధాంతిక విరోధి బీజేపీ లతోనే తమ పోరాటం అని కుండబద్దలు కొట్టారు. తాను, తన టీవీకే ఏ కూటమిలో భాగం కాబోమని.. కలిసొచ్చే పార్టీలకు రేపు అధికారం గనుక దక్కితే వాటా ఇస్తామని చెప్పారు. విజయ్ ఈ ప్రకటన అక్కడి రాజకీయాల్లో అలజడి రేపింది. పలు పార్టీలోని సీనియర్ నేతలు విజయ్ ఆఫర్‌కు టెంప్ట్ అవుతున్నారు. ప్రధాన ప్రతిపక్షం అన్నాడీఎంకేలో అసంతృప్త నేతలతో పాటు ఓట్ షేరింగ్ ఉన్న పార్టీలు, కుల ఓట్లను రాబట్టే పార్టీలు సైతం విజయ్ టీవీకేతో కూటమిగా ముందుకు వెళ్లాలని భావిస్తున్నాయి. ప్రజల సమస్యలపై నేరుగా స్పందించేందుకు, వారి అభిప్రాయాలను స్వీకరించేందుకు ఈ పర్యటనను ప్రజా ఉద్యమంగా మార్చాలని విజయ్ భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో విజయ్ మీట్ ది పీపుల్‌పై అధికార డీఎంకే ఓ కన్నేసింది. విజయ్ పర్యటనను నిశితంగా పరిశీలించాలని, ప్రత్యర్థి వ్యూహానికి చెక్ పెట్టేలా పునరాలోచనలు చేయాలని ఆ పార్టీ అధినేత, సీఎం స్టాలిన్ సీనియర్లకు సూచించినట్లు తెలుస్తోంది. అయితే టీవీకే కేడర్‌పై ఈ సమయంలోనే కేసులు నమోదు అవుతుండడంతో డీఎంకేపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అయితే విజయ్ మాత్రం ఇలాంటివాటికి వెనకడుగు వేయబోనని అంటున్నారు. 1967లో అన్నాదురై కాంగ్రెస్ ఆధిపత్యానికి గండికొట్టినట్లు.. 1977 అన్నాడీఎంకేతో ఎంజీఆర్ డీఎంకేను గద్దె దించినట్లు.. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరిపోరుతో అధికారం కైవసం చేసుకుని తానూ చరిత్ర సృష్టిస్తానని చెబుతున్నారు. జనంలోకి వెళ్తున్న విజయ్.. రెండు నెలలపాటు నాన్‌స్టాప్ పర్యటనలు చేపట్టబోతున్నారు. మొదటి విడతలో 10 జిల్లాల్లో పర్యటించేందుకు రూట్‌మ్యాప్ సిద్ధం చేశారు. శనివారం కీలక కార్యక్రమాలు జరుగుతాయి. ఆదివారం ఒకే ఒక్క కార్యక్రమం నిర్వహిస్తారు. మధ్యలో సెప్టెంబర్ 27, అక్టోబర్ 25వ తేదీన చెన్నైకి విజయ్ చేరుకుంటారు. పార్టీ ప్రకటన నుంచి మానాడు విజయవంతం దాకా.. విజయ్ వెంట నడిచింది యువతే. కాబట్టి యువత మద్దతుతోనే తన పర్యటనలను విజయవంతం చేసుకోవాలని విజయ్ భావిస్తున్నట్లు స్పష్టమవుతోంది.

# నేపాల్‌లో సైనిక పాలన?



నేపాల్‌లో రాజకీయ సంక్షోభం నెలకొంది. యువత హింసాత్మక ఆందోళనలకు దిగొచ్చిన కేపీ శర్మ ఓలీ తన ప్రధాని పదవికి రాజీనామా చేశారు. సైన్యం సూచన మేరకే ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో తనను సురక్షితంగా దేశం దాటించాలనే షరతు మీద ఆయన సైన్యం చెప్పింది చేసినట్లు అక్కడి మీడియా కథనాలు ఇస్తోంది. నేపాల్‌లో సోషల్ మీడియా బ్యాన్ యువతకు కోపం తెప్పించింది. ఇది అవినీతిని ప్రశ్నించే గొంతుకలను అణచివేయడమేనంటూ ప్రభుత్వ వ్యతిరేక నిరసనలకు దిగింది. అదే సమయంలో నేపాల్ నేతల వారసుల విలాసాలపైనా అందుబాటులో ఉన్న టిక్‌టాక్ లాంటి ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా నిలదీసింది. ఈ క్రమంలో సోమవారం ఆ ఆందోళనలు హింసాత్మకంగా మారాయి. సైన్యాన్ని రంగంలోకి దించినా.. పరిస్థితి ఏమాత్రం చల్లారలేదు. ఖాట్మండు సహా పలు ప్రాంతాల్లో జరిగిన ఆందోళనల్లో 19 మంది మరణించారు. దీంతో.. రాత్రికి రాత్రే ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంది. అయితే.. సోషల్ మీడియాపై బ్యాన్ ఎత్తేసినప్పటికీ.. వరుసగా రెండోరోజు మంగళవారం కూడా ఆందోళనకారులు తమ నిరసనలు కొనసాగించారు. ఈ క్రమంలో.. ఖాట్మండులోని అధ్యక్ష భవనం శీతల్ నివాస్‌తో పాటు ప్రధాని ఓలీ నివాసం, కార్యాలయంలోకి చొచ్చుకెళ్లారు. విధ్వంసం సృష్టించడంతో పాటు వాటికి నిప్పు పెట్టారు. ఈ క్రమంలో దాడి దృశ్యాలు.. నెట్టింటకు చేరాయి. అధ్యక్షుడు రామ్ చంద్ర పౌడెల్ ప్రైవేట్ నివాసంతో పాటు నేపాల్ కాంగ్రెస్ భవనం, పలువురు నేతల ఇళ్లనూ నిరసనకారులు వదల్లేదు. అదే సమయంలో.. అంతేకాదు ఆయన కార్యాలయంలోకి ఆందోళనకారులు చొరబడిన పరిస్థితులు ఏర్పడ్డాయి. వరుసగా మంత్రులు రాజీనామా చేయడం.. హింసాత్మక ఆందోళనలు మరింత ఉధృతరం కావడం, అదే సమయంలో సైన్యం ఒత్తిడితో ఆయన రాజీనామా చేసినట్లు సమాచారం. నేపాల్‌లో సైనిక పాలనా?.. లేకుంటే కొత్త ప్రధానిని ఎన్నుకుంటారా? అనే దానిపై సాయంత్రం లోగా స్పష్టత వచ్చే అవకాశం ఉంది.
తాజా పరిస్థితుల దృష్ట్యా ఖాట్మండులో నిరవధిక కర్ఫ్యూ విధించారు. అయినప్పటికీ ఆ దేశాలను ధిక్కరిస్తూ నిరసనకారులు ఆందోళన కొనసాగిస్తున్నారు. మరోవైపు.. ఇవాళ సాయంత్రం ఆల్‌పార్టీ మీటింగ్‌కు పిలుపు ఇచ్చిన ప్రధాని ఓలీ..ఈలోపే అనూహ్య నిర్ణయం తీసుకోవడం విశేషం.

**ప్రధాని ఓలీకి వరుస దెబ్బలు**

ఆందోళనలు కొనసాగుతున్న సమయంలో నేపాల్ ప్రధాని కేపీ శర్మ ఓలీకి రాజకీయంగా వరుస ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. నిరసనలు హింసాత్మకంగా మారడంతో నైతిక బాధ్యత వహిస్తూ హోంమంత్రి రమేశ్ లేఖక్ సోమవారం తన పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఆపై పదవి నుంచి వైదొలుగుతున్నట్లు ఆ దేశ వ్యవసాయ శాఖ మంత్రి రామ్‌నాథ్ అధికారి ప్రకటించారు. తాజా యువత ఆందోళనలకు మద్దతుగా నీటి సరఫరా శాఖ మంత్రి ప్రదీప్ యాదవ్ రాజీనామా చేశారు. అయితే ఈ వరుస రాజీనామాలను యువత పట్టించుకోలేదు. కర్ఫ్యూ, ఆంక్షలను ఛేధించుకుని మరీ వెళ్లి రాజీనామా చేసినవాళ్లతో పాటు ఇతర నేతల ఇళ్లకు నిప్పంటిస్తూ వస్తున్నారు. పలువురు నేతల నివాసాలతో పాటు వాళ్ల ప్రైవేట్ ఆస్తులకూ నిరసనకారులు నిప్పుపెట్టినట్లు స్థానిక మీడియా వెల్లడించింది.

**భారతీయులకు అడ్వైజరీ**

నేపాల్ ఆందోళనల దృష్ట్యా భారతీయులకు భారత విదేశాంగశాఖ ఓ అడ్వైజరీ జారీ చేసింది. "నేపాల్‌లో జరుగుతున్న పరిణామాలను మేము నిశితంగా పరిశీలిస్తున్నాం. ఖాట్మాండు సహా నేపాల్‌లోని ఇతర నగరాల్లో అధికారులు కర్ఫ్యూ విధించినట్లు గమనించాం. అనేకమంది ప్రజలు ప్రాణాలు కోల్పోవడం బాధాకరం. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నాము. అక్కడి అధికారుల సూచనలు అనుసరిస్తూ.. నేపాల్‌లోని భారత పౌరులు అప్రమత్తంగా ఉండాలి" అని విదేశాంగశాఖ పేర్కొంది. నేపాల్ ప్రభుత్వం శాంతియుత మార్గాలు, చర్చల ద్వారా సమస్యను పరిష్కరిస్తుందని ఆశిస్తున్నట్లు తెలిపింది.

# రణరంగంగా హిమాలయ దేశం..
# నేపాల్‌లోని భారతీయుల కోసం టోల్‌ఫ్రీ నంబర్లు ఏర్పాటు



నేపాల్‌లో అవినీతిపై యువత కదం తొక్కింది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నేపాలీ యువత చేపట్టిన ఆందోళనలు ఉధృతమయ్యాయి. వేల మంది ఆందోళనకారులు రోడ్లపైకి వచ్చి నిరసన వ్యక్తంచేస్తున్నారు. కర్ఫ్యూని సైతం లెక్కచేయకుండా వీధుల్లోకి వచ్చి రహదారులను దిగ్బంధించారు. ఈ ఆందోళనలతో హిమాలయ దేశం రణరంగాన్ని తలపిస్తోంది. ఈ ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో భారత్ అప్రమత్తమైంది. నేపాల్‌లోని భారతీయుల సహాయార్థం కాత్మాండూలోని భారత రాయబార కార్యాలయం టోల్‌ఫ్రీ నంబర్లు ఏర్పాటు చేసింది. భారతీయ పౌరులు ఏదైనా అత్యవసర పరిస్థితిలో లేదా సాయం అవసరమైతే వెంటనే 977-980 860 2881, 977-981 032 6134 నంబర్లను సంప్రదించాలని సూచించింది. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్టు చేసింది.

**భారతీయులకు కీలక అడ్వైజరీ**

మరోవైపు యువత ఆందోళనతో భారత్ అప్రమత్తమైంది. ఈ మేరకు నేపాల్‌లోని భారతీయులకు కీలక అడ్వైజరీ జారీ చేసింది. ప్రస్తుతం అక్కడ జరుగుతున్న పరిణామాలను నిశితంగా పరిశీలిస్తున్నట్లు తెలిపింది. అక్కడ భారతీయ పౌరులు జాగ్రత్తగా, సురక్షితంగా ఉండాలని సూచించింది. స్థానిక అధికారుల మార్గదర్శకాలను పాటించాలని పేర్కొంది. ఈ మేరకు విదేశాంగ మంత్రిత్వ శాఖ ఓ ప్రకటన విడుదల చేసింది. 'నిన్నటి నుంచి నేపాల్‌లో జరుగుతున్న పరిణామాలను నిశితంగా పరిశీలిస్తున్నాము. చాలా మంది యువకులు ప్రాణాలు కోల్పోవడం బాధాకరం. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నాం. రాజధాని కాఠ్మాండు సహా అనేక నగరాల్లో అధికారులు కర్ఫ్యూ విధించారు. నేపాల్‌లోని భారతీయ పౌరులు జాగ్రత్తగా ఉండాలి. అక్కడి అధికారులు జారీ చేసిన మార్గదర్శకాలను పాటించాలి' అని ప్రకటనలో తెలిపింది.

## భారత్‌కు వ్యతిరేకంగా సెనెటర్ వ్యాఖ్యలు..
## క్షమాపణలు చెప్పాలన్న ఆస్ట్రేలియా ప్రధాని

**ఇంటర్నెట్‌డెస్క్:** భారత్‌కు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేసిన సెనెటర్ వెంటనే క్షమాపణలు చెప్పాలని ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ ఆల్బనీస్ సూచించారు. ఆస్ట్రేలియాలో కొంతకాలంగా వలసదారులకు వ్యతిరేకంగా పెద్దఎత్తున జరుగుతున్న నిరసనల నేపథ్యంలో ఆమె చేసిన వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఆస్ట్రేలియాలో పెరుగుతోన్న జీవనవ్యయాలకు భారత వలసదారులను నిందిస్తూ సెంటర్ రైట్ లిబరల్ పార్టీకి చెందిన సెనెటర్ జసింటా ప్రిన్స్ విమర్శలు చేశారు. తమకు ఓట్లు పడేలా భారతీయ వలసదారులను రప్పిస్తున్నారని ఈసందర్భంగా ఆల్బనీస్‌కు చెందిన ఆస్ట్రేలియన్ లేబర్ పార్టీ పైనా ఆమె వ్యాఖ్యలు చేశారు. "ఆస్ట్రేలియాకు వలస వచ్చిన భారతీయుల సంఖ్య భారీగా ఉంది. ఆ సంఖ్యను లేబర్ పార్టీకి వచ్చిన ఓటింగ్‌లో మనం చూడొచ్చు" అని ప్రైస్ అన్నారు. ఈ వ్యాఖ్యలు ఆస్ట్రేలియన్-ఇండియన్ కమ్యూనిటీలో తీవ్ర ఆగ్రహానికి దారితీశాయి వెంటనే ఆమె క్షమాపణలు చెప్పాలని వారంతా డిమాండ్ చేశారు. సొంత పార్టీ కూడా ఆమె వైఖరిని ఖండించింది. ప్రైస్ విమర్శలపై ఆల్బనీస్ స్పందించారు. "భారత కమ్యూనిటీకి చెందిన ప్రజలను ఆ వ్యాఖ్యలు బాధించాయి. ఆమె వెంటనే క్షమాపణలు చెప్పాలి. ఆమె సొంత పార్టీ నేతలు కూడా అదే

## పాక్ వంకర బుద్ధి..
## ప్రధాని, ఆర్మీ చీఫ్ మధ్య వైరం అంటూ ఫేక్ ప్రచారం





**ఇంటర్నెట్ డెస్క్:** ఆపరేషన్ సిందూర్ సమయంలో పెద్దఎత్తున ఫేక్ ప్రచారానికి తెరలేపిన పాకిస్థాన్.. దాన్ని ఇంకా కొనసాగిస్తోంది. సామాజిక మాధ్యమాల వేదికగా భారత్‌పై విషం చిమ్ముతోంది. భారత ప్రభుత్వానికి వ్యతిరేకంగా కొన్ని అనుకూల ఎక్స్ హ్యాండిళ్ల నుంచి ఒకేతరహా ప్రచారం చేయిస్తోంది. దీన్ని పీఐబీ ఫ్యాక్ట్ చెక్ సమర్థంగా తిప్పికొట్టింది. భారత ప్రధాని నరేంద్రమోదీ, భారత ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేదిల మధ్య చెడిందంటూ ఓ కల్పిత ప్రచారానికి పాక్ తెరతీసింది. యుద్ధ సామగ్రిని అప్‌గ్రేడ్ చేయకుండా పాక్‌తో వివాదం పెట్టుకోవడం భారత ఆర్మీకి ఏమాత్రం ఇష్టం లేదనేది ఆ పోస్టుల సారాంశం. ఒకేతరహా సందేశం వేర్వేరు అకౌంట్ల నుంచి రావడంతో పీఐబీ ఫ్యాక్ట్‌చెక్ విభాగం అప్రమత్తమైంది. ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఉన్న ఈ సమాచారం పూర్తిగా అవాస్తవమని స్పష్టంచేసింది. ఇలాంటి అసత్య ప్రచారాలపై అప్రమత్తంగా ఉండాలంటూ పౌరులకు సూచించింది.

## ఆశ లేకపోతే.. జీవితమే లేదు



కాంగ్రెస్ పాలిత కర్ణాటకలో అధికార మార్పిడి వ్యవహారం మరోసారి తెరపైకి వచ్చింది. రాష్ట్రంలో ముఖ్యమంత్రి మార్పు అంశంపై ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ మరోసారి స్పందించారు. ఈ మేరకు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఆశ లేకపోతే.. జీవితమే లేదని, కాలమే అన్నింటికీ సమాధానం చెబుతుందంటూ పేర్కొన్నారు. ప్రముఖ జాతీయ మీడియా ఇండియా టుడే కాంక్లేవ్ సౌత్ 2025 సదస్సులో డీకే శివకుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'కాంగ్రెస్ ప్రభుత్వంలోని రెండో సగభాగం ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరిస్తారా..?' అన్న ప్రశ్న ఆయనకు ఎదురైంది. దీనికి డీకే స్పందిస్తూ.. 'నేను దీనికి సమాధానం చెప్పలేను. కాలమే అన్నింటికీ సమాధానం చెబుతుంది. ఈ ప్రపంచంలో ఎవరైనా సరే ఆశతో జీవించాలి. ఆశ లేకపోతే.. జీవితమే లేదు' అంటూ చెప్పుకొచ్చారు. సీఎం మార్పు నిర్ణయం పూర్తిగా కాంగ్రెస్ హైకమాండదేనని తెలిపారు. హైకమాండ్ నిర్ణయం, ఆదేశాల ప్రకారం ముందుకెళ్తామని చెప్పారు. హైకమాండ్ ఏం నిర్ణయిస్తే.. దాన్ని అంగీకరిస్తామని చెప్పుకొచ్చారు. ప్రస్తుతం ఆయన కామెంట్స్ వైరల్ అవుతున్నాయి.

## హిమాచల్‌లో వరదలు..
## రూ.1500 కోట్ల తక్షణ సాయం



**ఇంటర్నెట్ డెస్క్:** భారీ వర్షాలు, వరదలతో అతలాకుతలమైన హిమాచల్ ప్రదేశ్‌కు తక్షణ సాయం కింద ప్రధాని మోదీ రూ.1500 కోట్లు ప్రకటించారు. రాష్ట్రంలోని వరద ప్రభావిత, కొండచరియలు విరిగిపడిన ప్రాంతాల్లో పరిస్థితులను ఏరియల్ సర్వే ద్వారా పరిశీలించారు. ఈ క్రమంలోనే మృతుల బంధువులకు రూ.2 లక్షల చొప్పున, గాయపడిన వారికి రూ.50 వేల చొప్పున పరిహారం ప్రకటించారు. హెలికాప్టర్‌లో ఏరియల్ సర్వే అనంతరం ప్రధాని మోదీ కాంగ్రాలో ముఖ్యమంత్రి సుఖ్విందర్ సింగ్ సుఖు, గవర్నర్ శివప్రతాప్ శుక్లా తదితరులతో సమావేశమయ్యారు. సహాయక, పునరావాస చర్యలను సమీక్షించారు. నష్టాన్ని అంచనా వేశారు. ఈ సందర్భంగా వరద బాధితులను పరామర్శించారు. ప్రస్తుత విపత్కర పరిస్థితుల్లో రాష్ట్రం వెన్నంటే ఉంటామని.. వరద ప్రభావిత ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల పునరుద్ధరణకు అన్ని విధాలా సాయం చేస్తామని హామీ ఇచ్చారు. సహాయక చర్యల్లో నిమగ్నమైన ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, సైన్యం, రాష్ట్ర యంత్రాంగం సేవలను ప్రధాని మోదీ ప్రశంసించారు. ఇదిలా ఉండగా.. వరద నష్టాలను అంచనా వేసేందుకు కేంద్ర బృందాలు ఇప్పటికే హిమాచల్ ప్రదేశ్‌లో పర్యటించాయి. ఈ నేపథ్యంలో కేంద్ర బృందాల నివేదికలతో రాష్ట్ర ప్రభుత్వం సమర్పించిన విజ్ఞప్తుల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని మోదీ తెలిపారు. అనంతరం పంజాబ్‌లో పర్యటించనున్నారు.

## శృతిమించిన 'జెన్‌జీ' నిరసనలు..
## మాజీ ప్రధాని భార్యను చంపేశారు



కాఠ్మాండు: నేపాల్ రాజధాని కాఠ్మాండులో జరిగిన ఘోర ఘటన కలకలం రేపుతోంది. ఆందోళన కారులు నేపాల్ రాజధాని కాఠ్మాండూలో మాజీ ప్రధాని జాలనాథ్ ఖనాల్ సతీమణి రాజ్యలక్ష్మి చిత్రకార్ ఆందోళనకారుల దాడిలో ప్రాణాలు కోల్పోయారు. సోషల్ మీడియా,అవినీతికి వ్యతిరేకంగా జనరేషన్ జెడ్ చేపట్టిన ఉద్యమంతో ప్రధాని కేపీ ఓలీ రాజీనామా చేశారు. మాజీ ప్రధాని కేపీఓలీతో పాటు పలువురు మంత్రులు దేశం విడిచి పారిపోయినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో మరింత రెచ్చిపోయిన ఆందోళన కారులు కాఠ్మాండూలోని డల్లూ ప్రాంతంలో మాజీ ప్రధాని జాలనాథ్ ఖనాల్ ఇంటిని ముట్టడించారు. ఖనాల్ సతీమణి రాజ్యలక్ష్మి చిత్రకార్‌ను ఇంట్లో బంధించి, ఇంటికి నిప్పుపెట్టారు. మంటల్లో చిక్కుకున్న రాజ్యలక్ష్మిని కిర్తిపూర్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆమె ప్రాణాలు కోల్పోయారు. మాజీ ప్రధాని ఖనాల్ సతీమణి రాజ్యలక్ష్మి మరణంపై రాజకీయ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. భద్రతా వ్యవస్థపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

# పార్టీ మారిన 10 మంది ఎమ్మెల్యేలు ఏ లింగమో..?

-మొదటిపేజీ తరువాయి

కాంగ్రెస్ పార్టీ, టీడీపీ పార్టీ.. ఈ రెండు పార్టీలు పాలమూరు వెనుకబాటు తనానికి కారణమని రేవంత్ చెప్పిన విషయం అందరికీ తెలుసు. ఇది ఈ జిల్లా వాసులకు కూడా తెలుసు అని కేటీఆర్ పేర్కొన్నారు. మా జిల్లా బిడ్డ సీఎం అయితే కొంత ప్రయోజనం కలుగుతుందని, లాభం ఉంటుందని, తప్పకుండా శరవేగంగా అభివృద్ధి జరుగుతుందని, పాలమూరు బతుకు ముఖచిత్రం మారుతుందని ఇలా ఎన్నో ఆశలతో ప్రజలు 12 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలను గెలిపించారు. నిన్నటితో 21 నెలలు నిండి 22వ నెలలో నడుస్తుంది. వాస్తవం ఏందంటే.. కేసీఆర్ నాయకత్వంలో పాలమూరు ఎత్తిపోతల కింద 90 శాతం పనులు పూర్తయ్యాయి. రిజర్వాయర్లు పూర్తయ్యాయి. ఒక వడ్డించిన విస్తరిలా రేవంత్‌కు అప్పజెప్పి గద్దె దిగాం. రేవంత్ చేయాల్సింది 10 శాతం పనులు మాత్రమే. కాల్వలు పూర్తి చేసి నీళ్లు ఇచ్చే అవకాశం ఉంది. ఆ పని చేయకుండా.. కేసీఆర్ కట్టిన కరివెన, వట్టెం, ఉద్ధండపూర్, నార్లాపూర్, ఏదుల రిజర్వాయర్లు ప్రజలకు గుర్తు వస్తది.. రైతులు శాశ్వతంగా కేసీఆర్ పేరును గగుండెల్లో పెట్టుకుంటారని చెప్పి ఒక దురాచలోనతో కావాలని ఈ ఎత్తిపోతలను రేవంత్ రెడ్డి పడావు పెట్టారు. ఈ పరిస్థితులను రైతాంగం గమనిస్తుంది అని కేటీఆర్ తెలిపారు. పాలమూరు ఎత్తిపోతల ద్వారా కొడంగల్ నియోజకవర్గంలో 2 లక్షల ఎకరాలు, రంగారెడ్డి జిల్లాలో 6 లక్షల ఎకరాలకు నీళ్లు అందించే అవకాశం ఉంది. కానీ సీఎం రేవంత్ రెడ్డి శ్రీశైలం నుంచి జూరాలకు సోర్స్ మార్చి కొడంగల్ %-% నారాయణపేట ఎత్తిపోతల పథకానికి రూ. 4 వేల కోట్లతో ప్రత్యేక టెండర్లు పిలిచారు. ఈ ప్రాజెక్టుకు ఎలాంటి అనుమతల్లేవు. కొడంగల్ ఎత్తిపోతలపై గ్రీన్ ట్రిబ్యునల్ స్టే ఇచ్చింది. ఈ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా రైతులు పోరాటం చేస్తున్నారు. మాకు పరిహారం చెల్లించాలని కదం తొక్కుతున్నారు అని కేటీఆర్ తెలిపారు. కేసీఆర్ నాయకత్వంలో పదేండ్లలో ఉమ్మడి పాలమూరు జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసి 8 లక్షల ఎకరాలకు నీళ్లు ఇవ్వడమే కాకుండా పాలమూరును సస్యశ్యామలం చేయడమే కాకుండా, కోనసీమ జిల్లాగా మార్చాలని పాలమూరు ఎత్తిపోతలో 90 శాతం పనులు పూర్తి చేశారు ఇది కేసీఆర్ ఘనత. 22 నెలలుగా మిగిలిన 10 శాతం పనులు పూర్తి చేయకుండా పాలమూరును ఎండబెడుతున్నది పాలమూరు బిడ్డగా చెప్పకునే రేవంత్ రెడ్డి. ఇంకా ఆశ్చర్యం ఏంటంటే అరపైసా పని చేయకుండా.. పాలమూరు ఎత్తిపోతలకు పిల్లనిచ్చిన మామ జైపాల్ రెడ్డి పేరు పెట్టుకున్నారు. జైపాల్ రెడ్డి నీటిపారుదల రంగానికి ఏం చేశారో జిల్లా వాసులకు తెలుసు. ఒక్క రూపాయి కేటాయించకుండా ఆ ప్రాక్టును పూర్తి చేయకుండా



పడావుబెట్టి.. రైతుల నోట్లో మట్టి కొడుతున్నది రేవంత్ రెడ్డినే అని కేటీఆర్ నిప్పులు చెరిగారు.

**పార్టీ మారిన 10 మంది ఎమ్మెల్యేలు ఏ లింగమో..?**

హైదరాబాద్ : బీఆర్ఎస్ పార్టీ తరపున గెలిచి కాంగ్రెస్ పార్టీలో చేరిన పది మంది ఎమ్మెల్యేలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిప్పులు చెరిగారు. ఈ 10 మంది ఎమ్మెల్యేలు ఏ లింగమో.. వారికి వారే తెలుసుకోలేని పరిస్థితి ఉందని కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. జడ్చర్లలో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. మీడియా సమావేశం ముగిసిన అనంతరం పార్టీ మారిన ఎమ్మెల్యేలపై విలేకరులు ప్రశ్నించగా కేటీఆర్ ఈ విధంగా బదులిచ్చారు. నిన్న గాక మొన్న ఒక టీవీ ఇంటర్వ్యూలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. అవును ఆ పది మంది ఎమ్మెల్యేలు మా పార్టీలో చేరారు అని స్పష్టంగా చెప్పారు. మరి పీసీసీ ప్రెసిడెంటే అప్రూవర్‌గా మారిన తర్వాత, ఆయనే నేరాంగీకారం చేసిన తర్వాత ఇంకా ఎంక్వైరీ ఎందుకు..? చర్చ ఎందుకు..? ఆ పది మంది ఎమ్మెల్యేలపై వేటు వేసేందుకు స్పీకర్‌కు మొహమాటం ఎందుకు..? అని కేటీఆర్ ప్రశ్నించారు. ఆల్రెడీ సుప్రీంకోర్టులో మ్యాటర్ ఉంది. ఇవాళ కాంగ్రెస్ నాయకత్వం ఏమనుకుంటుంది అంటే ప్రజలను, మీడియాను, న్యాయ వ్యవస్థను కూడా చిన్నచూపు చూస్తూ వాళ్లతో చిలిపిఆటలాడి తప్పించుకోవచ్చన్న ధోరణితో వ్యవహరిస్తున్నారు అని కేటీఆర్ మండిపడ్డారు.

గద్వాల ఎమ్మెల్యే పార్టీ మారారు. ఇవాళ ఆయనది చాలా విచిత్రమైన పరిస్థితి. పార్టీ మారిన 10 మంది ఎమ్మెల్యేలు ఏ పార్టీలో ఉన్నారంటే చెప్పుకోలేని పరిస్థితిలో ఉన్నారు. కానీ పీసీసీ ప్రెసిడెంట్ అప్రూవర్‌గా మారారు. అలాగే కడియం శ్రీహరి కాంగ్రెస్‌లో చేరానని స్పష్టంగా చెప్పారు. ఇవన్నీ ఆన్‌రికార్డు మీడియాతోనే చెప్పారు. ఇంకా దీన్ని చర్చించడానికి, పరిశోధించడానికి ఏం లేదు. వెంటనే వారిపై వేటు వేయాలని మా పార్టీ తరపున డిమాండ్ చేస్తున్నాం. కోర్టు తీర్పును గౌరవించాలని కోరుతున్నాం అని కేటీఆర్ పేర్కొన్నారు.

గద్వాల ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీలో ఉంటే.. బీఆర్ఎస్ కార్యాలయానికి ఎందుకు రావడం లేదు..? బీఆర్ఎస్ శాసనసభా పక్షంతో ఎందుకు కూర్చోవడం లేదు..? బీఆర్ఎస్ కార్యక్రమాల్లో ఎందుకు పాల్గొనడం లేదు..? ప్రజలు పిచ్చివాళ్లు అనుకుని మాట్లాడుతున్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలను అగౌరవ పరచడం కాకపోతే ఇంకేంటి..? నిన్న మంత్రుల సమావేశంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీని, కేసీఆర్ తిడుతుంటే పళ్లు ఇకిలించి కూర్చున్నది ఎవరు.. మా బీఆర్ఎస్ ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డినా.. కాంగ్రెస్ పార్టీలో చేరినా కృష్ణ మోహన్ రెడ్డినా..? అని కేటీఆర్ ప్రశ్నించారు. ముఖ్యమంత్రి భాషలో చెప్పాలంటే రెండే లింగాలు ఉంటాయి.. ఒకటి స్త్రీ లింగం.. మరొకటి పు లింగం.. వీళ్లు ఏ లింగమో చెప్పుకోలేని పరిస్థితిలో ఉన్నారు. ఇది మన కర్మ. ఇలాంటి వారికి ప్రజలు ఓటేసి గెలిపించుకున్నందుకు కార్యకర్తలు బాధపడే పరిస్థితి. అత్యున్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు స్పీకర్ నిర్ణయం తీసుకోవాలి. స్పీకర్ ఉల్టా చేస్తే మళ్లీ సుప్రీంకోర్టుకు వెళ్తాం అని కేటీఆర్ స్పష్టం చేశారు. బీఆర్ఎస్ నాయకుల మీద కాంగ్రెస్ సర్కార్ అక్రమ కేసులు పెడుతోంది కేటీఆర్ : కేటీఆర్ %ఖు=% ఎ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ నాయకులను కాంగ్రెస్ సర్కార్ తీవ్రమైన వేధింపులకు గురి చేస్తుందని మండిపడ్డారు.

**బీఆర్ఎస్ నాయకుల మీద కాంగ్రెస్ సర్కార్ అక్రమ కేసులు పెడుతోంది కేటీఆర్ : కేటీఆర్**

రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ నాయకులను కాంగ్రెస్ సర్కార్ తీవ్రమైన వేధింపులకు గురి చేస్తుందని మండిపడ్డారు. మండల, గ్రామస్థాయి నాయకులను తీవ్ర మానసిక క్షోభకు గురి చేస్తున్నారని కేటీఆర్ పేర్కొన్నారు. జడ్చర్లలో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ నాయకుల మీద కాంగ్రెస్ సర్కార్ కేసులు పెడుతుంది.. దేవరకద్రలో మండల పార్టీ ప్రెసిడెంట్ మీద లేని కేసు పెట్టి జైలుకు పంపించారు. పార్టీ మారితే కేసు తీసేస్తాం.. పార్టీ మారకపోతే జైల్లో వేస్తాం అన్నట్లు ప్రవర్తిస్తున్నారు. చిన్నచిన్న వ్యాపారాలు చేసుకునే నాయకులపై కక్ష సాధింపు చర్యలుకు పాల్పడుతున్నారు. పోలీసులు, జీఎస్టీ అధికారులను పంపించి మానసికంగా వేధిస్తున్నారు. తెలంగాణలో ఎక్కడ చూసినా చౌకబారు రాజకీయం జరుగుతుంది. ఇకనైనా కళ్లు తెరిచి, నిద్రలో నుంచి మేల్కొని, బయటకు వచ్చి.. వెంటనే పాలమూరు ఎత్తిపోతలను సత్వరమే పూర్తి చేయాలి. ఇది పూర్తి చేస్తే జిల్లా రైతాంగం, మేం అభినందిస్తాం. లేదంటే ప్రజల తరపున నిలదీస్తాం.. ఎండగడుతాం అని కేటీఆర్ హెచ్చరించారు.

# ఒకప్పుడు ఏపీలో అమ్ముకుని హైదరాబాద్‌కు వచ్చేవారు.. ఇప్పుడు సీన్ రివర్స్ అయ్యింది..

గతంలో ఏపీలో అమ్ముకుని హైదరాబాద్‌కు వచ్చేవారని.. కానీ ఇప్పుడు మొత్తం రివర్స్ అవుతోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత చామకూర మల్లారెడ్డి అన్నారు. తెలంగాణలో ఇప్పుడు రియల్ ఎస్టేట్ పరిస్థితి బాగోలేదని మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి తెలిపారు. తన పుట్టిన రోజు సందర్భంగా తిరుమల శ్రీవారిని మంగళవారం ఉదయం మల్లారెడ్డి దర్శించుకున్నారు.దర్శనం అనంతరం చామకూర మల్లారెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ హయాంలో పదేళ్లలో దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణను కేసీఆర్ అభివృద్ధి చేశారని తెలిపారు. హైదరాబాద్‌కు కేటీఆర్ మల్టీ నేషనల్ కంపెనీలను తీసుకొచ్చారని పేర్కొన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక తెలంగాణ రియల్ ఎస్టేట్ పరిస్థితి బాగోలేదని తెలిపారు. గతంలో ఏపీలో అమ్ముకుని హైదరాబాద్‌కు వచ్చేవారని.. కానీ ఇప్పుడు పరిస్థితి మొత్తం



రివర్స్ అవుతోందని ఆవేదన చెందారు. తెలంగాణ వాళ్లు కూడా ఏపీలో ఆస్తులు కొని వ్యాపారాలు చేస్తున్నారని తెలిపారు. తెలంగాణలో మళ్లీ కేసీఆర్ అధికారంలోకి వస్తేనే పాత రోజులు వస్తాయని అభిప్రాయపడ్డారు. తెలంగాణకు మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి కావాలని ఆ దేవుడిని ఈ సందర్భంగా ప్రార్థిస్తున్నానని తెలిపారు. ఏపీ సీఎం చంద్రబాబుపై కూడా చామకూర మల్లారెడ్డి ప్రశంసలు కురిపించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని చంద్రబాబు బాగా అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. ఏపీకి ప్రధాని మోదీ రూ.లక్షల కోట్లు కేటాయిస్తున్నారని పేర్కొన్నారు. ఏపీలో అభివృద్ధిని చంద్రబాబు పరుగులు తీయిస్తున్నారని వ్యాఖ్యానించారు.

## సీఎం రేవంత్ రెడ్డికి మతి భ్రమించి మాట్లాడుతున్నాడు : మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు




**పెద్దపల్లి :** సీఎం రేవంత్ రెడ్డికి మతి భ్రమించి మాట్లాడుతున్నాడు. ఆయనతోపాటు మొత్తం మంత్రివర్గాన్ని రీ కాల్ చేయా అని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు అన్నారు. మంగళవారం మంథని బీఆర్ ఎస్ పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. ఆయన ఎంత ఎత్తు ఉన్నడో అంతే మెదడు ఉందని సీఎంను ఘాటుగా విమర్శించారు. మీ ఎత్తుకన్న తక్కువ మెదడు ఉన్నట్లు మాట్లాడుతున్నావని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి పిచ్చిపట్టినట్టు మాట్లాడితే ఊరుకోమన్నారు. రేవంత్ రెడ్డిని ఎర్రగడ్డ హాస్పిటల్‌కు తరలించాలని రాష్ట్రపతిని కోరుతున్నామన్నారు. హైట్‌కి తగ్గట్టు మెదడు పెంచుకోవాలని రేవంత్‌కు సూచించారు. నీకు తెలివి లేదు, నీ పక్కన ఉన్న మంత్రులకు తెలివి లేదన్నారు. ఎల్లంపల్లి ప్రారంభించింది 2004లో.. పూర్తయింది 2016లో అలాంటప్పుడు ఎల్లంపల్లి ప్రాజెక్టను శ్రీపాద ఎలా కట్టాడు? శ్రీపాద రావు చనిపోయింది 1999లో అని గుర్తు చేశారు. పొడుగున్నోనికి తెలివిలేదంటూ హరీశ్ రావును అవహేళన చేసేలా మాట్లాడావు. పొట్టిగున్న నీకేముంది? కాళేశ్వరం కూలిపోలేదు, నీ ముఖం కూలిపోయిందన్నారు. కాంగ్రెస్ మంత్రి వర్గం తెల్లకల్లు తాగిన కోతిలాగ వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా తెలివిగా వ్యవహరించండి. అన్నారం, సుందిల్ల బ్యారేజీలను వాడండి. లక్షల క్యూసెక్కుల నీళ్లు వృథాగా సముద్రం పాలవుతున్నాయి. ఇప్పటికైనా ప్రజలకు నీళ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## కేసీఆర్ నాయకత్వంలో మళ్లీ తెలంగాణకు పూర్వవైభవం



హైదరాబాద్: బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పిలుపునిచ్చారు. సోమవారం బీఆర్ఎస్ పార్టీ బూత్ స్థాయి కమిటీ సభ్యులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే ప్రజలు కేసీఆర్ నాయకత్వంలో మళ్లీ తెలంగాణ పూర్వవైభవం రావాలన్న ఆశతో ఉన్నారని గుర్తు చేశారు. అబద్దాలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఒక్క హామీ నెరవేర్చలేదని ఎద్దేవా చేశారు. ఇవన్నీ కూడా ప్రజలకు వివరించాలని తెలిపారు. సమావేశంలో కూకట్‌పల్లి బీఆర్ఎస్ పార్టీ కో-ఆర్డినేటర్ సతీష్ అరోరా, కార్పొరేటర్లు ముద్దం నరసింహ యాదవ్, ఆవుల రవీందర్ రెడ్డి, పండాల సతీష్‌గౌడ్, జూపల్లి సత్యనారాయణ, మందడి శ్రీనివాసరావు, మహేశ్వరి, మేడ్చల్ జిల్లా మైనార్టీ అధ్యక్షుడు మహ్మద్ గౌసుద్దీన్, మాజీ కార్పొరేటర్ పగడాల బాబురావు, తూము శ్రవణ్ కుమార్, ఎర్రగడ్డ డివిజన్ అధ్యక్షుడు సంజీవ్, ప్రధాన కార్యదర్శి షరీఫ్ కురేషి, కేపీహెచ్‌బీ డివిజన్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, నాయకులు అజీముద్దీన్, సయ్యద్ రసూల్, కళ్యాణి పాల్గొన్నారు.

## భారత ఉపరాష్ట్రపతిగా సీపీ రాధాకృష్ణన్

-మొదటిపేజీ తరువాయి

అయిన జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి 300 ఓట్లు వచ్చాయి. 17 మంది ఎంపీలు గైర్హాజరవగా.. 15 ఓట్లు చెల్లకుండా పోయాయి. ఎలక్టోరల్ కాలేజీలో మొత్తం 781 మంది సభ్యులు ఉన్నారని రాజ్యసభ సెక్రటరీ తెలిపారు. ఎన్నికల్లో 767 మంది సభ్యులు ఓటు వేశారని.. 752 చెల్లుబాటు అయ్యాయని ఆయన తెలిపారు. విజయానికి 377 ఓట్లు అవసరమని వివరించారు. సీపీ రాధాకృష్ణన్ పూర్తి పేరు చంద్రపురం పొన్నుస్వామి రాధాకృష్ణన్. ఆయన 1957 అక్టోబర్ 20న తమిళనాడు తిరుప్పూర్‌లో సీకే పొన్నుసామి, కే జానకి దంపతులకు జన్మించారు. తూత్తుకుడిలోని వీఓ చిదంబరం కళాశాల నుంచి బ్యాచిలర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ డిగ్రీ అందుకున్నారు. 1974లో ఆయన జనసంఘ్ రాష్ట్ర కార్యనిర్వాహక కమిటీకి ఎన్నికయ్యారు. 1980లో బీజేపీలో చేరారు. అటల్ బిహారీ వాజ్‌పేయికి సన్నిహితుడు. ప్రస్తుతం ఆయన తమిళనాడు గవర్నర్‌గా కొనసాగుతున్నారు. అంతకుముందు ఆయన జూలై 31, 2024 నుంచి మహారాష్ట్ర గవర్నర్‌గా పనిచేశారు. అంతకుముందు ఫిబ్రవరి 2023 నుంచి జూలై 2024 వరకు జార?ండ్ గవర్నర్‌గా సేవలందించారు. తెలంగాణ గవర్నర్‌గా పని చేసిన తమిళిసై సౌందర్ రాజన్ రాజీనామా చేయడంతో ఆమె స్థానంలో తెలంగాణ, పుదుచ్చేరి గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించారు.ఆయన ఆర్ఎస్ఎస్‌లో పని చేశారు. బీజేపీ నుంచి 1998 లో కోయంబత్తూర్ నుంచి లోక్‌సభకు ఎన్నికయ్యారు. 1999 సార్వత్రిక ఎన్నికల్లోనూ మళ్లీ గెలుపొందారు. ఆయన తమిళనాడు బీజేపీ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు కూడా . 2004 సార్వత్రిక ఎన్నికల్లో భారత కమ్యూనిస్ట్ పార్టీకి చెందిన కే సుబ్బరాయన్ చేతిలో ఆయన ఓటమి పాలయ్యారు. ఇటీవల జగ్‌దీప్ ధన్‌ఖర్ ఉపరాష్ట్రపతి పదవికి రాజీనామా చేయడంతో బీజేపీ ఆయనను ఎన్డీయే అభ్యర్థిగా ప్రకటించింది.

## 'ఇదే రిపీట్ అయితే మళ్లీ పరీక్ష

**హైదరాబాద్:** గ్రూప్ 1 పరీక్షపై తెలంగాణ హైకోర్టు కీలక తీర్పు వెల్లడించింది. గతంలో ప్రకటించిన జనరల్ ర్యాంకింగ్ లిస్ట్‌ను రద్దు చేస్తూ.. మెయిన్స్ పరీక్షల రీవాల్యుయేషన్‌కు ఆదేశించింది. ఒకవేళ రీవాల్యుయేషన్ సాధ్యం కాకపోతే పరీక్షలు మళ్ళీ నిర్వహించాలని స్పష్టం చేసింది. దీంతో ఇప్పటికే సర్టిఫికెట్ వెరిఫికేషన్ అయిన అభ్యర్థులకు చుక్కెదురైనట్లయ్యింది. గ్రూప్-1 వాల్యుయేషన్‌లో(మూల్యాంకనం) అవకతవకలు జరిగాయని, పరీక్షలను రద్దు చేయాలని కోరుతూ కొందరు, అలాగే ఇప్పటికే ఎంపిక ప్రక్రియ పూర్తయి ఉత్తర్వుల దశలో ఉన్న పరీక్షలను రద్దు చేయరాదంటూ ఎంపికైన అభ్యర్థులు మరికొందరు వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. వీటన్నింటిని ఒక్కటిగా విచారించిన హైకోర్టు.. జులై 7న వాదనలు ముగియడంతో తీర్పును రిజర్వ్ చేసింది. ఈ క్రమంలో.. "సంజయ్ వర్సెస్ యూపీ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లో ఇచ్చిన తీర్పులోని మాన్యువల్ ప్రకారం రీవాల్యుయేషన్ జరగాలి. అవకతవకలకు తావు లేకుండా వాల్యుయేషన్ చేయాలి. ఆ తర్వాతే 563 మందిని ఎంపిక చేసి పోస్టింగులు ఇవ్వాలి. మరోసారి అవకతకవలు జరిగితే మళ్లీ పరీక్షలకు ఆదేశిస్తాం" అని జస్టిస్ నామవరపు రాజేశ్వరరావు తీర్పు వెల్లడించారు

ఇప్పటికే గ్రూప్-1 పరీక్షల ఎంపిక ప్రక్రియ పూర్తయినప్పటికీ హైకోర్టులో కేసు విచారణ దృష్ట్యా కమిషన్ నియామక ఉత్తర్వులు జారీ చేయలేదు. ఈలోపు.. రీవాల్యుయేషన్‌కు ఆదేశిస్తూ రిక్రూట్‌మెంట్ బోర్డు(%ఱ+ూజ%)ను హైకోర్టు ఆదేశించింది. రీవాల్యుయేషన్ జరిపించిన తర్వాతే వాటి ఆధారంగా ర్యాంకులు ఇవ్వాలని, ఒకవేళ అది సాధ్యం కాకపోతే మళ్లీ పరీక్ష నిర్వహించాలని స్పష్టం చేసింది.

**తీర్పుపై సవాల్**

గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల రీవాల్యుయేషన్‌కు హైకోర్టు ఆదేశించిన నేపథ్యంలో టీజీపీఎస్సీ కీలక నిర్ణయం తీసుకుంది. సింగిల్ బెంచ్ ఇవాళ ఇచ్చిన తీర్పును సవాల్ చేసే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. మరోవైపు.. నిరాశలో ఉన్న అభ్యర్థులు సైతం డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించే యోచనలో ఉన్నారు. కిందటి ఏడాది ఫిబ్రవరి 19వ తేదీన 563 పోస్టులకు టీజీపీఎస్సీ తరపున నోటిఫికేషన్ వెలువడింది. మే/జూన్‌లో ప్రిలిమ్స్, అక్టోబర్‌లో మెయిన్స్ పరీక్షలు జరిగాయి. ఈ ఏడాది మార్చిలో మెయిన్స్ ఫలితాలు, ఏప్రిల్‌లో ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికేషన్ వెరిఫికేషన్ కూడా పూర్తైంది. పోస్టింగుల కోసం ఎదురు చూస్తున్న తరుణంలో ఇప్పుడు హైకోర్టు సింగిల్ బెంచ్ పోస్టింగులకు బ్రేకులు వేసింది.

## అందరికీ ఆదర్శంగా సీఎం రేవంత్ రెడ్డి



-మొదటిపేజీ తరువాయి

అధికారులు రేవంత్ రెడ్డి ఇంటి ప్రహరీ గోడను కూడా కూల్చివేశారు. దీనిపై అదనపు కలెక్టర్ దేవసహాయం మాట్లాడుతూ, విస్తరణలో ఇళ్లు కోల్పోయే వారికి పరిహారం అందించాలని 2 నెలల క్రితమే సీఎం తమను ఆదేశించారని, ఆ ఆదేశాల మేరకే రోడ్డు నిర్మాణ పనులను వేగవంతం చేసినట్లు వివరించారు. కాగా.. రెండు రోజుల క్రితం అధికారులు ముఖ్యమంత్రి ఇంటి ప్రహరీ గోడను కూల్చివేయడంతో.. ప్రస్తుతం ఆ గోడ పునర్నిర్మాణ పనులు జరుగుతున్నాయి.. ఈ విషయంలో గ్రామస్థులు సీఎం రేవంత్ రెడ్డిని ప్రశంసిస్తున్నారు. సీఎం అయినప్పటికీ.. ఎలాంటి బేధం లేకుండా.. గోడను కూల్చేయాలని అధికారులకు ఆదేశాలివ్వడం.. గ్రేట్ అంటూ అభినందిస్తున్నారు.

## కేసీఆర్ అజెండాను తెలంగాణ జాగృతి తరపున ముందుకు తీసుకెళ్తాం: కవిత



**హైదరాబాద్:** మాజీ సీఎం కేసీఆర్ అజెండాను తెలంగాణ జాగృతి తరపున ముందుకు తీసుకెళ్తామని ఆ సంస్థ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. కాళోజీ జయంతి సందర్భంగా జాగృతి కార్యాలయంలో కాళోజీ చిత్రపటానికి ఆమె పూలమాల వేసి నివాళులర్పించారు. బుధవారం చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగానూ అంజలి ఘటించారు. అనంతరం కవిత మాట్లాడుతూ.. "ఉన్నతమైన ఆశయాలతో అడుగు వేయాలని ఆలోచిస్తున్నాం. ఉన్నతమైన లక్ష్యం దిశగా సంప్రదింపులు జరుగుతున్నాయి. సామాజిక తెలంగాణ సాధించే వరకు జాగృతి కార్యకర్తలు విశ్రమించబోరు. సామాజిక తెలంగాణ సాధన కోసం అందరినీ కలుపుకొని ముందుకు సాగుతాం. కేసీఆర్ అజెండాను తెలంగాణ జాగృతి తరఫున ముందుకు తీసుకెళ్తాం. కాళోజీ స్ఫూర్తితోనే అందరమూ పని చేశాం.. పని చేస్తాం. ఐలమ్మ స్ఫూర్తితో అందరూ విజృంభించి అన్యాయాన్ని ఎదుర్కోవాల్సిన అవసరం ఉంది. జస్టిస్ సుదర్శన్‌రెడ్డి ఉప రాష్ట్రపతిగా ఎన్నికైతే ఆ పదవికి వన్నె తెస్తారు' అని కవిత అన్నారు.

http://www.agnidharanews.com
అగ్నిధార

# శ్రీశైల ముంపు బాధితుల 98 జీవో సాధించడమే లక్ష్యం





**న్యాయం కోసం పట్టు విడువని విక్రమార్కుడిలా కదిలిన నాయకుడు**

**బిజెపి పార్టీ రాష్ట్ర నాయకులు ధారాసింగ్.**

**అగ్నిధార న్యూస్. చిన్నంబావి మండలం.** శ్రీశైలం ప్రాజెక్టు భూ నిర్వాసితుల వైపు అనుకూలంగా ఫైనల్ జడ్జిమెంట్ ఇచ్చిన తెలంగాణ హైకోర్టు. అతి త్వరలో ఉద్యోగాలలో చేరబోతున్న శ్రీశైలం ప్రాజెక్టు ముంపు భూ నిర్వాసితుల తరపున హైకోర్టులో వాదనలు వినిపించిన అడ్వకేట్ కు శాలువాతో సన్మానం చేసిన బిజెపి పార్టీ సీనియర్ నాయకులు ధారసింగ్ 98 జీవో బాధితులు. చిరకాల స్వప్నమైన 45 సంవత్సరాల శ్రీశైలం ముంపు నిర్వాసితుల 98 జీవో కోసం అహర్నిశలు పనిచేస్తున్న ధారసింగ్ 98 జీవో కోసం చట్ట పరంగా ముందుకెళ్తూ అతి త్వరలో 98 జీవోను సహకారం చేసి శ్రీశైలం ముంపు బాధితుల జీవితాల్లో వెలుగు నింపబోతున్న ధారాసింగ్. 45 సంవత్సరాల నుండి ఏ రాజకీయ నాయకుడికి సాధ్యం కానీ 98 జీవోను ఏ రాజకీయ పదవి పొందని వ్యక్తి ధారాసింగ్ అన్ని తానై ముందుండి ముంపు బాధితుల కోసం పెద్దన్న పాత్ర పోషిస్తూ జీవోను చివరి అంకానికి చేర్చిన గొప్ప మనసున్న సంఘసంస్కర్త ఎన్నో ఏళ్లుగా శ్రీశైలం ముంపు బాధితుల గోసా చూడలేక సొంత మండలం నాయకుడు చలించిపోయి దారాసింగ్ ఈ సమస్యను తన బుజస్కంధాలపై వేసుకొని అన్నీ తానై శ్రీశైలం ప్రాజెక్టు ముంపు నిర్వాసితులను వెంటబెట్టుకొని చట్టపరంగా సాధించుకోబోతున్న గొప్ప మానవతావాది ధారాసింగ్ అదే మన బహుజన బిడ్డ బీసీ కింది స్థాయి నుండి పేదల కష్టాలను తెలిసినవాడు కనుక శ్రీశైలం ప్రాజెక్టు కింద సర్వం కోల్పోయిన భూనిర్వాసితుల కష్ట సుఖాలు తెలిసినోడు కనుక సొంతంగా డబ్బులు లేని బాధితుల కోసం లక్షల రూపాయలు ఖర్చుపెట్టి 98 జీవోను సాధించడమే తన అంతిమ లక్ష్యంగా పెట్టుకుని అతి త్వరలో శ్రీశైలం ప్రాజెక్టు కింద సర్వం కోలిపోయిన మూడు జిల్లాల శ్రీశైలం ప్రాజెక్టు ముంపు కుటుంబాల కలను సాకారం చేయబోతున్న మన ధారాసింగ్ మూడు జిల్లాల ప్రజల తరపున ఆశీస్సులు అందిస్తూ ఎల్లప్పుడూ రాజకీయ పదవులు ఉన్నా లేకున్నా మానవతా దృక్పథంతో ప్రజల పక్షాన నిలబడి పోరాడాలని మీరు అనుకున్న లక్ష్యాలను చేరుకోవాలని శ్రీశైల ముప్పు బాధితులు కృతజ్ఞతలు తెలిపారు.

## ఖనిలో ఘనంగా కాళోజీ జయంతి వేడుకలు



**అగ్నిధార న్యూస్ ,(రామగుండం):** రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో ప్రజా కవి కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.మంగళవారం రామగుండం కార్పొరేషన్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమానికి కార్పొరేషన్ అరుణ శ్రీ హాజరై కాళోజీ చిత్రపటానికి పూల మాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు.ఈ సందర్భంగా కాళోజి సేవలను కొనియాడారు.ఈ కార్యక్రమంలో రామగుండం కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకట స్వామి,ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి వి రామన్,అసిస్టెంట్ కమిషనర్ వెంకటేశ్వర్లు సెక్రెటరీ ఉమా మహేశ్వర రావు,ఎ సి పి శ్రీహరి,ఆర్ ఓ ఆంజనేయులు సూపరింటెండెంట్ పబ్బాల శ్రీనివాస్ సానిటరీ ఇన్స్పెక్టర్ సంపత్,మెప్మా టి ఎం సి రజనీ పాల్గొన్నారు.

## రామగుండం కమిషనరేట్ లో ఘనంగా కాళోజి జయంతి వేడుకలు



**అగ్ని ధార న్యూస్,( రామగుండం):** ప్రజా కవి కాళోజీ 111వ జయంతి ఉత్సవాన్ని (తెలంగాణ తెలుగు భాష దినోత్సవం) రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనరేట్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.ఈ సందర్భంగా సీపీ గమాట్లాడుతూ... తెలంగాణ యాసలో సామాజిక రచనలు చేసి ప్రజలను చైతన్యపరిచి, సామాజికంగా మేల్కొల్పిన గొప్ప ప్రజాకవి కాళోజి అని ఆయన సేవలను గుర్తించి ప్రభుత్వం పద్మవిభూషణ్ బిరుదు తో గౌరవించిందన్నారు. కాళోజి జీవితం అందరికి స్ఫూర్తిదాయకమని ఆయన సాహిత్యం ఉద్యమ సాధనలో స్ఫూర్తిని నింపిందని, అన్నివేళలా ఆదర్శం అని అన్నారు కాళోజీ కి నివాళులు అర్పించిన వారిలో అడ్మిన్ ఇంచార్జ్ ఏసీపీ శ్రీనివాస్, ఏవో శ్రీనివాస్, ఆర్ఐ లు దామోదర్, శ్రీనివాస్, మల్లేశం, వివిధ వింగ్స్ ఇన్స్పెక్టర్లు, సీపీఓ సూపర్డెంట్లు, సిబ్బంది, ఇతర పోలీస్ సిబ్బంది వున్నారు.

## తెలంగాణ భాషకు చుక్కాని కాళోజీ నారాయణ రావు

ప్రిన్సిపాల్ సదానందం గౌడు




**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** కల్వకుర్తి పట్టణంలోని వై ఆర్ ఎం జూనియర్ డిగ్రీ కళాశాలలో తెలంగాణ భాష దినోత్సవం కాళోజీ జయంతి వేడుకలను కళాశాల ప్రిన్సిపాల్ సదానందం గౌడు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కాళోజీ నారాయణ రావు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.తెలంగాణ ఉద్యమ నేత, ప్రిన్సిపాల్ సదానందం గౌడు మాట్లాడుతూ మాతృభాషను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపైన ఉందని ,ఇంగ్లీష్ వ్యామోహంలి పడి మాతృభాషను మరచిపోవద్దని అన్నారు. రఘువీరు లక్ష్మీకాంత్ కాళోజీ నారాయణరావు స్వాతంత్ర సమరయోధుడు,కవి ,రచయిత పద్మభూషణ్ అవార్డు గ్రహీత, తెలంగాణ భాషాభిమాని ఉస్మానియా విశ్వవిద్యాలయంలో వందేమాతరం ఉద్యమ నాయకుడు నిజాం నిరంకుశ పరిపాలన వ్యవస్థకు వ్యతిరేకంగా ఉద్యమించి జైలు శిక్షను అనుభవించిన వారు తొలిదశ మలిదశ తెలంగాణ ఉద్యమానికి చుక్కాని కాళోజీ గారు అంటూ పుట్టుక నీది ,చావు నీది బతకతా తెలంగాణది అంటూ గర్జిస్తూ ప్రాంతేతరుడు మోసం చేస్తే తీరం దాకా తరిమి కొడదాం, ప్రాంతం వాడే మోసం చేస్తే ప్రాంతంలోనే పాతిపెడదాం అప్పుడే విముక్తి ఉంటదని అందుకే తెలుగు భాష పేరుతో తెలంగాణా భాషాభివృద్ధి కోసం కాళోజీ నిరంతరం పాటు పడినారని ప్రిన్సిపాల్ సదానందం గౌడు పేర్కొన్నారు.అనంతరం ప్రిన్సిపాల్, లెక్చరర్స్, స్టూడెంట్స్ తెలుగు అధ్యాపకులు శ్రీనివాస్ కి శాలువా కప్పి సన్మానించారు.ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ నేహా ఉన్నీసా నవీన్ కుమార్, యాదయ్య, ప్రభాకర్ గౌడ్, శ్రీనివాస్, బాల్ రాజ్, రామకృష్ణ, శ్రీశైలం గౌడ్, హుస్సేన్ ఉమేష్ కుమార్,శబనా మేడం భాగ్యలక్ష్మి మేడం,శరత్ కుమార్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## రింగ్ టెన్నిస్ జాతీయ లెవెల్లో ప్రతిభ కనబరిచిన దీక్షిత్ సాత్విక్




**అగ్నిధార న్యూస్ ,(మంథని) :** మంథని పట్టణం లోని తెలంగాణ సాంఘీక సంక్షేమ బాలురు గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థులు ఎం. దీక్షిత్ 8 వ తరగతి, జి. సాత్విక్ 9వ తరగతి ల విద్యార్థులు తెలంగాణ రాష్ట్రం తరుపున ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం లోని లక్నో నగరంలో సబ్ జూనియర్స్ రింగ్ టెన్నిస్ పెడరేషన్ ఆఫ్ ఇండియా వారు నిర్వహించిన జాతీయ క్రీడా పోటిలలో పాల్గొని జాతీయ స్థాయిలో వెండి పతకం, కాంస్య పతకం తో పాటు సర్టిఫికెట్ సొంతం చేసుకొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఉటూరి శ్రీనాథ్ విజయం పై సంతోషం వ్యక్తం చేస్తూ విద్యార్థులను, పి డి రమేశ్, పి ఇ టి పుష్పలత లను అభినందించారు. అనంతరం మాట్లాడుతూ... చదువుల్లోనే కాకుండా, ఆటల్లో, డ్యాన్సుల్లో, పాటల్లోనూ ప్రతిభ కనబరుస్తున్న విద్యార్థులు పాఠశాలకు ఎంతో గర్వ కారణమని పేర్కొన్నారు. విద్యార్థులకు ప్రతిభను వెలికితీసేలా పాఠశాల వేదికగా ఉంటుందని, క్రీడలతో పాటు చదువులకు సమాన ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు..ఈ కార్యక్రమంలో జూనియర్ వైస్ ప్రిన్స్ పాల్ ఎ. రవి పాల్గొన్నారు.

## విగ్రహా ఆవిష్కరణలో పాల్గొన్న మాజీ మంత్రి కేటీఆర్, హరీష్ రావు



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**నాగర్ కర్నూల్ జిల్లా తిమ్మజిపేట మండలం అవంచ గ్రామంలో మాజీ మంత్రి లక్ష్మారెడ్డి సతీమణి కీ.శే. చర్లకోల శ్వేత ప్రథమ వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన విగ్రహాన్ని ముఖ్య అతిథులుగా పాల్గొని ఆవిష్కరించిన మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్ రావు, సందర్భంగా విగ్రహానికి పూల మాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు శ్రీనివాస్ గౌడ్, నిరంజన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మర్రి జనార్ధన్ రెడ్డి,ఆల వెంకటేశ్వర్ రెడ్డి, ఎస్ రాజేందర్ రెడ్డి, నరేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా దేవాలయం నిర్మాణానికి చేయూత

ట్రస్టు ఛైర్మెన్ ఉప్పల వెంకటేష్



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**చారకొండ మండలం జేపల్లి గ్రామంలో నిర్మిస్తున్న శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయ పునర్నిర్మాణం కోసం గ్రామా ఆలయ కమిటీ నిర్వాహకులు ఆలయ నిర్మాణానికి సహకరించాలని బిఆర్ఎస్ పార్టీ మాజీ మిషన్ భగీరథ రాష్ట్ర వైస్ చైర్మన్ ఉప్పల చారి టబుల్ ట్రస్టు చైర్మన్ ఉప్పల వెంకటేష్ నీ మర్యాద పూర్వకంగా కలిసి సంప్రదించడంతో స్పందించి సిమెంట్ అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ దేవాలయ నిర్మాణానికి సహకరించిన మాజీ రాష్ట్ర మిషన్ భగీరథ వైస్ చైర్మన్ మాజీ జెడ్పిటిసి ఉప్పల వెంకటేష్ కి గ్రామం తరపు నుండి రుణపడి ఉంటామని శ్రీ ఎల్లమ్మ తల్లి దీవెనలు ఆయనపై ఎల్లప్పుడూ ఉండాలని కోరడం జరిగింది.ఈ కార్యక్రమంలో శ్రీనివాసులు, వెంకటయ్య, శేఖర్, రమేష్, పరుశురాం, నరేందర్ తదితరులు పాల్గొ న్నారు.

## నిరుపేద కుటుంబ ఇంటి నిర్మాణానికి చేయూత

ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** వెల్దండ మండలంలోని రాచుర్ గ్రామానికి చెందిన గంగ దారి ఆంజనేయులు నిరుపేద కుటుంబానికి చెందినవారు కావడంతో వారు నిర్మించుకుంటున్న ఇంటి నిర్మాణం అసంపూర్తిగా మిగిలిపోవడంతో స్థానిక బిఆర్ఎస్ నాయకుల ద్వారా ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ తలకొండపల్లి మాజీ జెడ్పిటిసి మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ నీ సంప్రదించగా వెంటనే స్పందించి తన ట్రస్ట్ ద్వారా సిమెంట్ ఇప్పించడం జరిగింది, నిరుపేద కుటుంబానికి చెందిన ఆంజనేయులు, కుటుంబ సభ్యులు ఉప్పల వెంకటేష్ కి ధన్యవాదాలు తెలిపారుఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటిసి గుత్తి వెంకటయ్య తూర్పు అంజయ్య,మాజీ జెడ్పిటిసి నరసింహ మాజీ సర్పంచ్ లలిత జ్యోతయ్య వార్డు మెంబర్ నూకం కోటీశ్వర్, రవికుమార్, నరసింహ, వెంకటేష్ యాదవ్, కర్ణాకర్ రెడ్డి, జంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

ట్రస్టు ఛైర్మెన్ ఉప్పల వెంకటేష్



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** తలకొండపల్లి మండలం పడకల్ గ్రామానికి చెందిన జంతుక బాలయ్య మృతి చెందడం జరిగిందిఈ విషయం స్థానిక బిఆర్ఎస్ పార్టీ నాయకుల ద్వారా తెలుసుకున్న ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మాజీ మిషన్ భగీరథ వైస్ చైర్మన్ తలకొండపల్లి మాజీ జెడ్పిటిసి ఉప్పల వెంకటేష్ సానుభూతి తెలుపుతూ కుటుంబానికి 3000 రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ గ్రామ నాయకులు చౌటి విజయకుమార్, బండగళ్ల చందు, అంబటి లింగయ్య, చౌటి మల్లేష్, చౌటి పెంటయ్య, యాదయ్య, వెంకటయ్య, తదితరులు పాల్గొనడం జరిగింది.

## అంతిమ యాత్రలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే



**అగ్నిధార న్యూస్ కమాన్ పూర్** కమాన్ పూర్ మండలం గుండారం గ్రామంలో భీఆర్ఎస్ పార్టీ నాయకులు దండే రమేష్ (ఠాగూర్) తండ్రి రాజయ్య మరణించగ వారి అంతిమ యాత్ర లో పాల్గొని వారి పార్థీవ దేహాన్ని కి పూలమాల వేసి నివాళులు అర్పించి వారి కుటుంబాన్ని పరామర్శించిన మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్

# ఎల్ఎండీ రిజర్వాయర్ గేట్ల ఎత్తివేత

## 4వేల క్యూసెక్కుల నీటి విడుదల

## ఇక సాగు,తాగు నీటి సమస్యకు తావు లేదు

## : ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి



**అగ్నిధారా న్యూస్/సెప్టెంబర్/9** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండల పరిధిలోగల లోయర్ మానేరు డ్యామ్ (ఎల్ఎండి)కు ఎగువన ఉన్న మిడ్ మానేరు నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరడంతో రిజర్వాయర్ వద్ద గల 10,11 నెంబర్ గల రెండు గేట్లను ఎత్తివేశారు. మంగళవారం సాయంత్రం మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, కరీంనగర్ సీపీ గౌస్ ఆలం, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, ఎస్సారెస్పీ ఎస్సీ పెద్ది రమేశ్ తో కలిసి గేట్లు ఎత్తివేసి నీటిని విడుదల చేశారు. ఎల్ఎండీ రిజర్వాయర్ నీటి నిల్వ సామర్థ్యం 24.034 టీఎంసీలు కాగా, ఇటీవల కురిసిన ఎడతెరపిలేని వర్షాల వల్ల ఎగువ ప్రాంతం నుంచి భారీగా వరద నీటితో దీని సామర్థ్యం 23.516 టీఎంసీలకు చేరింది. ఫలితంగా నాలుగు వేల క్యూసెక్కులను దిగువ ప్రాంతాలకు విడుదల చేశారు. దీంతో కరీంనగర్ నుంచి సూర్యాపేట వరకు 9 లక్షల ఎకరాలకు సాగు నీరందడమే కాకుండా తాగునీటి చింత తీరనున్నది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ, ప్రస్తుతం ఎల్ఎండీ రిజర్వాయర్ నిండుకుండలా ఉందని, ఇన్ ఫ్లో భారీగా వచ్చి చేరుతున్నదన్నారు. మరికొన్ని రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున వచ్చే సంవత్సరంలో సాగు,తాగు నీటి సమస్యలు తలెత్తడానికి అవకాశాలు లేవన్నారు. నీరు సమృద్ధిగా ఉండటం వల్ల పంటలు బాగా పండుతాయన్నారు. నీటిని ఏ మాత్రం వృధా చేసుకోకుండా ప్రతి నీటి బొట్టును రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. గేట్లు ఎత్తి నీటిని దిగువ ప్రాంతానికి విడుదల చేయడం సంతోషకరంగా ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సారెస్పీ కార్యనిర్వాహక ఇంజనీరు సదయ్య, ఉప కార్యనిర్వాహక ఇంజినీర్ శ్రీనివాస్, ఎఈఈలు గీతిక, సంజన,వంశీధర్, వెంకటేశ్, కిరణ్, కరీంనగర్ నగర ఏసీపీ వెంకటస్వామి టూటౌన్ సీఐ సృజన్ రెడ్డి,తిమ్మాపూర్ సీఐ సదన్ కుమార్, తిమ్మాపూర్ ఎస్ఐ కె.శ్రీకాంత్ గౌడ్, లేక్ వ్యూ ఎస్ ఐ బి. రమేశ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్ఐలు బండారి రమేశ్, సుధగోని లక్ష్మినారాయణ గౌడ్,ఒగ్గు దామోదర్, మోరపల్లి రమణారెడ్డి, తుమ్మనపల్లి శ్రీనివాసరావు, శ్రీగిరి రంగారావు, కుంట రాజేందర్ రెడ్డి, గోపు మల్లారెడ్డి, మామిడి అనిల్ కుమార్, చింతల లక్ష్మారెడ్డి, బుధారపు శ్రీనివాస్, కొత్త తిరుపతిరెడ్డి, గంకిడి లక్ష్మారెడ్డి, మాచర్ల అంజయ్య, ముక్కిస రత్నాకర్ రెడ్డి, చెప్యాల శ్రీనివాస్, శ్రీకాంత్, జి.సంపత్ రెడ్డి, కంది అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పంటలకు సరిపడా యూరియాను అందించి రైతులను ఆదుకోవాలి

## సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

## లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి




**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** రైతులకు సరైన సమయంలో యూరియా అందక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి అన్నారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా వ్యవసాయ అధికారిని ఉష ని కలిసి యూరియా అందక రైతులు పడుతున్న ఇబ్బందులను వివరించినట్లు తెలిపారు. కడ్తాల్, ఆమనగల్, తలకొండపల్లి, మాడ్గుల్ మండలాలలో రైతులకు సరిపడా యూరియా అందకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తద్వారా పంటలను నష్టపోయే పరిస్థితులు తలెత్తుతాయని, వెంటనే రైతులకు వీలైనంత తొందరగా యూరియా అందజేయాలని కోరుతూ వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి మాట్లాడుతూ రైతులు వ్యవసాయ పనులను, పాడి పశువులను వదిలి యూరియా సెంటర్ల దగ్గర రోజుల తరబడి యూరియా కోసం ఎదురు చూస్తున్నప్పటికిని, రైతులకు మేలు జరిగే చర్యలు చేపట్టకపోవడం బాధాకరమని అన్నారు. రైతులకు సరైన సమయంలో యూరియా అందకపోవడంతో పంట దిగుబడి రాదని, తద్వారా వ్యవసాయ పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితులు ఉండవని స్పష్టం చేశారు. రైతులు రోజు మొత్తం యూరియా సెంటర్ల దగ్గర పడిగాపులు కాస్తే ఒకటి, రెండు యూరియా బస్తాలు మాత్రమే దొరకడంతో రైతులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారని తెలిపారు. ఇట్టి విషయంలో రైతులకు సరిపడా యూరియాను వెంటనే అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మక్తమాదారం మాజీ సర్పంచ్ సాయిలు, కడ్తాల్ బీసీ మండల అధ్యక్షులు పిప్పళ్ళ వెంకటేష్, గూద పర్వత్ కుమార్ యాదవ్,జంబుల అభిషేక్ రెడ్డి,శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# ఐక్యత ఆధ్వర్యంలో జర్నలిస్టులకు హెల్త్ క్యాంప్

**ఈనెల 13, 14 వ తేదీన జర్నలిస్టు కుటుంబ సభ్యులు సద్వినియోగం చేసుకోగలరు.**

**టాస్క్ సి ఓ ఓ ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి.**






**అగ్నిధార న్యూస్ (కల్వకుర్తి)** కల్వకుర్తి నియోజకవర్గంలోని జర్నలిస్టు మిత్రుల కోసం ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేయడం జరుగుతుంది కావున ఈనెల 13 తేదీ ఉదయం 8:00 గంటల నుండి మధ్యాహ్నం 1:00 గంటల వరకు ఆమనగల్, కడ్తల్, తలకొండపల్లి,మాడుగుల మండల మీడియా మిత్రులు వారి కుటుంబ సభ్యుల కోసం ఆమనగల్ ఐక్యత ఫౌండేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేయడం జరిగింది. తేదీ 14 ఆదివారం రోజు ఉదయం 8:00 గంటల నుండి మధ్యాహ్నం 1:00 వరకు కల్వకుర్తి, వెల్దండ, చార కొండ,మండలాల మీడియా మిత్రులు వారి కుటుంబ సభ్యులకు కల్వకుర్తి ఐక్యత ఫౌండేషన్ కార్యాలయం లో ఏర్పాటు చేయడం జరిగింది.అని తెలంగాణ కాంగ్రెస్ పార్టీ టాస్క్ సి ఓ ఓ ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య శిబిరంలో అందించే సేవలు ఉచిత వైద్యుల కన్సల్టేషన్డయాగ్న స్టిక్ పరీక్షలుఆరోగ్యంపై అవగాహన మా ప్రధాన దృష్టి వ్యాధి నివారణ సంరక్షణముందస్తుగా వ్యాధులను గుర్తించడం ఆరోగ్యంపై అవగాహన కల్పించడం.సమాజానికి సమాచారం చేరవేసే జర్నలిస్టు మిత్రులు,తమ ఆరోగ్యం పై శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం ఎంతైన ఉంది అని ఆయన అన్నారు. వారి ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని నిర్వహిస్తున్న.సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి మొబైల్ హెల్త్ క్యాంప్ సేవలు అందరూ కూడా సద్వినియోగం చేసుకోవాలి అని ఆయన అన్నారు.

## మృతుని కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటా

**కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్ రెడ్డి**



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** తలకొండపల్లి మండలంలోని పడకల్ గ్రామానికి చెందిన జంతిక బాలయ్య అనారోగ్యంతో బాధపడుతు మరణించడం జరిగింది విషయం స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకుల ద్వారా తెలుసుకున్న తలకొండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డోకూరి ప్రభాకర్ రెడ్డి 3000 రూపాయలు మరియు మాజీ ఉప సర్పంచ్ జల్లెల శ్రీశైలం యాదవ్ 3000 రూపాయలు మొత్తం 6000 రూపాయలు మృతుని కుటుంబ సభ్యులకు అందించడం జరిగింది ఈ కార్యక్రమంలో పడకల్ మాజీ ఎంపీటీసీ జోగు రమేష్, మాజీ వార్డు సభ్యులు బురిగళ్ళ రమేష్, ఉపాధ్యక్షుడు తుళ్ల తిరుపతి గౌడ్, పార్టీ అధ్యక్షుడు శ్రీశైలం యాదవ్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు బర్ల చెన్నయ్య, జోగు రామచంద్రయ్య, బషీర్, మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు గౌస్, బ్యాగరి నరసింహ, చెవిటి బాలమైసయ్య, శివగల రమేష్ ,మల్లేష్, రామచంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

## మత్స్య గిరింద్రస్వామి దర్శించుకున్న సీఐ




**అగ్నిధార న్యూస్ :శంకరపట్నం/సెప్టెంబర్/9** శంకరపట్నం మండలం కొత్తగట్టు గ్రామం లోని మత్స్య గిరింద్ర స్వామిని దర్శించుకున్న హుజురాబాద్ రూరల్ సీఐ పులి వెంకట్ సతీ సమేతంగా దంపతులు స్వామివారిని దర్శించుకున్నారు, ఆలయ అర్చకులు, ఆలయ పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు, ఈ కార్యక్రమంలో సీఐ దంపతులను ఆలయ చైర్మన్ కొరెం రాజి రెడ్డి, ధర్మకర్తలు శాలువతో సన్మానించారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాల లెక్చరర్లకు సన్మానం



**అగ్నిధార న్యూస్మహమ్మదాబాద్:** ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని మంగళవారం నాడు మహమ్మదాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపక బృందాన్ని షష్ట్యాబ్ది స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుడి స్థానం ఉన్నతమైనది. ప్రతి వ్యక్తి ఎదుగుదలకు కారకుడు ఒక ఉపాధ్యాయుడు. అలాంటి ఉపాధ్యాయులను గౌరవించుకోవడం మాకు దక్కిన అదృష్టం అని షష్ట్యాబ్ది స్టూడెంట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి విజయానంద రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో షష్ట్యాబ్ది ప్రధాన కార్యదర్శి విజయానంద్ రెడ్డి, రామ్ రెడ్డి, ముంతాజ్ హుస్సేన్, రాజేశ్వర్, రాములు, అనంతయ్య గుప్తా, బాలరాజు, శ్రీను, వేణు కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపల్ పాషా మరియు అధ్యాపక బృందం పాల్గొన్నారు

## జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడికి ఘనంగా సన్మానం




**అగ్నిధార న్యూస్ మహమ్మదాబాద్ /గండీడ్ :** మహబూబ్ నగర్ జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా గండీడ్ మండలం రంగారెడ్డి పల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు గౌరవనీయులు శ్రీ బాల్ రాజ్ గౌడ్ ని గండీడ్ మండల కేంద్రం స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో శాలువతో సన్మానం చేసిన మండల ఉపాధ్యాయ సంఘాల నాయకులు మరియు ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు కార్యక్రమంలో మండల ఎంఈఓ రుద్రారం జనార్ధన్ సల్కర్ పెట్ కాంప్లెక్స్ జిహెచ్ఎం విజయలక్ష్మి, పి.ఆర్.టి.యు.టి.ఎస్ మండల అధ్యక్షులు ఎ.శ్రీనివాస్ రెడ్డి టి.ఎస్.యు.టి.ఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి పగిడ్యాల్ బోరు కృష్ణయ్య, పి.ఆర్.టి.యు తెలంగాణ మండల అధ్యక్షులు జి.మహిపాల్ రెడ్డి, టి.జి యు.ఎస్ మండల అధ్యక్షులు లావుడ్యా రవీందర్, కొమిరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు లావుడ్యా సేవియా, బస్సురుగొండ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు లావుడ్యా కిషన్, సల్కర్ పేట్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మణ్, గండీడ్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, చిన్న వార్వాల్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అంగడి అరుణ దేవి, వెన్నచేడ్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మంజుల, కాంప్లెక్స్ మీటింగు కు వచ్చిన ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## రెస్క్యూ జి యం శ్రీనివాస్ రెడ్డికి వినతి పత్రం అందజేసిన రెస్క్యూ ప్రతినిధులు




**అగ్నిదార న్యూస్ గోదావరిఖని టౌన్ సెప్టెంబర్ 09** సింగరేణి సంస్థలో పనిచేస్తూ అత్యవసరం సమయంలో సంస్థ యొక్క ప్రాణ నష్టం, ఆస్తి నష్టం కలగకుండ కాపాడే సైనికులు రెస్క్యూ ఉద్యోగులు అని అలాంటి వారిని సింగరేణి యాక్టివ్ రెస్క్యూ ట్రెడ్ పర్సన్ గా తన సర్వీస్ కాలానికి గాను ఉద్యోగ విరమణ పొందే ముందు జోనల్ రెస్క్యూ కాంపిటేషన్ జరిగే సమయంలో వీరిని ప్రత్యేకంగా గుర్తించి సన్మానించి షీల్డ్ ను అందజేయాలని తెలియపరుస్తూ ఈరోజు రెస్క్యూ స్టేషన్ లో రెస్క్యూ జిఎం శ్రీనివాస్ రెడ్డి కి వినతి పత్రాన్ని అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు సానుకూలంగా స్పందిస్తూ తప్పకుండా ఈ యొక్క కార్యక్రమాన్ని చేపడతామని అది కూడా రేపు జరగబోయే జోనల్ రెస్క్యూ కాంపిటీషన్ ప్రోగ్రాం లో జరిపిస్తామని హామీ ఇవ్వడం జరిగింది ఈ యొక్క కార్యక్రమంలో రాజేందర్ రెడ్డి రెస్క్యూ సూపర్నెంటెడ్, తిరుపతి నరసింహ మూర్తి ఇన్స్ట్రక్టర్స్ సింగరేణి ఆక్టివ్ రెస్క్యూ ట్రెండ్ పర్సన్స్ చల్లా రవీందర్ రెడ్డి, కట్ల కైలాష్, గూడెల్లి అశోక్, రాకం రాజన్న, మల్లారెడ్డి, నవాబ్, కళాధర్, సంజీవ్ తో పాటు రెస్క్యూ సిబ్బంది పాల్గొన్నారు

## మంథనిలో జోన్ స్థాయి 69 ఎస్జిఎఫ్ క్రీడా పోటీలు



**అగ్నిధార న్యూస్ మంథని :** పెద్దపల్లి జిల్లాలోని మంథని, ముత్తారం, రామగిరి కమాన్పూర్ మండలాల నుండి వచ్చిన కబడ్డి, ఖో ఖో అండర్ 14, అండర్ 17 ఇయర్స్ జట్ల మధ్య హోరా హోరీగా పోటీ జరగగా ఫైనల్ మ్యాచ్ టీఎస్ ఆర్ డబ్ల్యూ గురుకులం ఫస్ట్ ప్రైస్, కృష్ణవేణి సెంటినరీ కాలనీ సెకండ్ ప్రైజ్, కబడ్డీలో అండర్ 17 ఫస్ట్ ప్రైస్ టీఎస్ ఆర్ డబ్ల్యు,సెకండ్ ప్రైజ్ గుంజపడుగు, 17 ఖో ఖో లో ఫస్ట్ ప్రైస్ టీఎస్ ఆర్ డబ్ల్యు,సెకండ్ ప్రైజ్ గుంజపడుగు సాధించారని మంథని జోన్ సెక్రటరీ కొమురోజు శ్రీనివాస్ తెలియజేశారు.

## ఘనంగా కాళోజి జయంతి వేడుక




**అగ్నిధారన్యూస్ ( కరీంనగర్ )** కరీంనగర్ జిల్లా కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో మంగళవారం ప్రిన్సిపాల్ ఎ.నిర్మల ఆధ్వర్యంలో పద్మవిభూషన్, కాళోజి నారాయణ రావు జయంతి పురస్కరించుకొని తెలంగాణ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్బంగా ప్రిన్సిపల్ మాట్లాడితే...కాళోజి నారాయణ రావు ఒక కవి, స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ ఉద్యమకారుడు, బహు భాషలలో ప్రావీణ్యం కలవారు. నిజాం పాలనకు వ్యతిరేకంగా పోరాడి, తెలంగాణ ప్రజల హక్కుల కోసం తన కలాన్ని గళంగా ఎత్తారని,1992లో ఆయనకు పద్మవిభూషణ్ అవార్డు లభించిందని కొనియాడారు. కాళోజి నారాయణరావు రాసిన "నా గొడవ" ఆయన కవితా సంకలనానికి పేరు, ఇది సామాజిక అన్యాయాలకు వ్యతిరేకంగా ఆయన చేసిన పోరాటానికి నిదర్శనం అన్నారు. ఆయన తెలంగాణ ప్రజల ఆశలు, ఆకాంక్షలకు ప్రతిబింబంగా నిలిచిన ప్రజాకవి. "అన్యాయాన్నెదిరిస్తే నా గొడవకు సంతృప్తి, అన్యాయం అంతరిస్తే నా గొడవకు ముక్తి ప్రాప్తి" అని ఆయన తన "నా గొడవ" కవితలో పేర్కొన్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ జి. వెంకటరాజిరెడ్డి ఎన్ ఎస్ ఎస్ పి ఓ,అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

## 19న గైర్హాజరు ఉద్యోగులకు కౌన్సిలింగ్

**- ఎపిఎ జిఎం**



**అగ్నిధార న్యూస్ రామగిరి :** ఈ నెల 19న గైర్హాజరు ఉద్యోగులకు కౌన్సిలింగ్ నిర్వహించ నున్నామని అడ్రియాల ప్రాజెక్టు ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వర రావు ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్పొరేట్ కార్యాలయం వారి ఆదేశాల మేరకు అడ్రియాల ప్రాజెక్టు ఏరియాల లోని అడ్రియాల లాంగ్ వాల్ గనిలో విధులు నిర్వహిస్తు 2025 సంవత్సరంలో జనవరి మాసం నుండి ఆగస్టు మాసం వరకు 80 మాస్టర్ల కంటే తక్కువ హాజరు నమోదు చేసిన ఉద్యోగులకు సెంటినరీ కాలనీలోని సి.ఎన్.సి.ఓ.ఏ. క్లబ్ నందు ఈ నెల 19న ఉదయం 9 గంటల నుండి గైర్హాజరు కౌన్సిలింగ్ నిర్వహించబడునని తెలిపారు. కావున సదరు ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులతో గైర్హాజరుకు సంబంధించిన ధ్రువపత్రాలను వెంట తీసుకొని, ఈ కౌన్సిలింగ్ కు తప్పకుండా హాజరు కావాలని తెలిపారు. సంబంధిత గనుల సంక్షేమాధికారులు గైర్హాజరు ఉద్యోగులకు తెలియజేసి, వారి కుటుంబ సభ్యులతో సహా హాజరయ్యే విధంగా చూడాలని సూచించారు.

# కష్టాల్లో ఉన్న పేదలను ఆదుకోవడమే సర్కార్ లక్ష్యం

### 62 మందికి రూ.19.97 లక్షల విలువ చేసే చెక్కులు పంచిన ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి



**అగ్నిధారా న్యూస్ / సెప్టెంబర్/9** మానకొండూరు నియోజకవర్గంలోని తిమ్మాపూర్ మహాత్మ నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ప్రభుత్వ వైద్యపరమైన ఇబ్బందుల్లో ఉన్న పేదలకు చేదోడు వాదోడుగా ఉండాలనే ఉద్దేశంతోనే రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) నుంచి ఆర్థిక సహాయం అందజేస్తున్నదని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ వెల్లడించారు. మంగళవారం ఎల్ఎండీ కాలనీలోని ప్రజాభవన్ లో తిమ్మాపూర్ మండలానికి చెందిన 62 మందికి 19.97 లక్షల రూపాయల విలువ చేసే చెక్కులతోపాటు మరో 17 మందికి కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ ప్రజలకు మేలు చేయడం, కష్టాల్లో ఉన్న వారిని ఆదుకోవడం ప్రభుత్వ లక్ష్యమని, అందులో భాగంగానే సీఎంఆర్ఎఫ్ నుంచి సహాయాలు అందజేస్తున్నదని వివరించారు. వైద్యం కోసం ఖర్చు పెట్టిన మొత్తాన్ని ప్రభుత్వం పూర్తిస్థాయిలో ఇవ్వలేకున్నా కొంత మేరకు ఆర్థికంగా వెసులుబాటు కల్పిస్తున్నదని ఆయన వివరించారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నదని గుర్తు చేశారు. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం, 200 యూనిట్ల లోపు విద్యుత్ వాడకం దారులకు ఉచిత విద్యుత్తు, చౌకధరల దుకాణాల ద్వారా దొడ్డు బియ్యానికి బదులు సన్న బియ్యం పంపిణీ అందజేస్తూ పేదల కడుపులు నింపుతున్నామన్నారు. ప్రజల సంక్షేమం కోసం పాటుపడుతున్న రాష్ట్ర ప్రభుత్వానికి అండగా ఆదరణ చూపించాలని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి కోరారు. ఈ కార్యక్రమంలో తిమ్మాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బండారి రమేశ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుధగోని లక్ష్మినారాయణ గౌడ్, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు మోరపల్లి రమణారెడ్డి, పార్టీ నాయకులు తుమ్మనపల్లి శ్రీనివాసరావు, శ్రీగిరి రంగారావు, కుంట రాజేందర్ రెడ్డి, గోపు మల్లారెడ్డి, మామిడి అనిల్ కుమార్, అనభేరి రాధాకిషన్ రావు, చింతల లక్ష్మారెడ్డి, బుధారపు శ్రీనివాస్, కొత్త తిరుపతిరెడ్డి, గంకిడి లక్ష్మారెడ్డి, మాచర్ల అంజయ్య, జి.సంపత్ రెడ్డి, గుంటి మల్లేశ్, పెంట వినోద్ కుమార్, కాసర్ల సంపత్, వీర చంద్రారెడ్డి, కంది అశోక్ రెడ్డితోపాటు వివిధ గ్రామాల పార్టీ అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజా చైతన్య కవిత్వానికి కేరాఫ్ అడ్రస్ కాళోజి

### ధిక్కార స్వరం కాళోజీ కవితలు.




**అగ్నిధార న్యూస్ వరంగల్** వరంగల్, హనుమకొండ న్యాయమూర్తులు నిర్మలా గీతాంబ, డాక్టర్ పట్టాభి రామారావు, ప్రొఫెసర్ బన్న ఐలయ్య,ధిక్కార స్వరంతో ప్రజా చైతన్య కవిత్వానికి కేరాఫ్ అడ్రస్ గా ప్రముఖ కవి కాళోజీ నిలిచారని వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నిర్మలా గీతాంబ అన్నారు. వరంగల్, హనుమకొండ జిల్లాల న్యాయవాద సంఘాల ఆద్వర్యంలో వరంగల్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు వలుస సుధీర్ అధ్యక్షతన వరంగల్ కోర్టు ఆవరణ అంబేద్కర్ హాల్ లో జరిగిన మహా కవి కాళోజి జయంతి, తెలుగు బాషా దినోత్సవంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రజాకవి కాళోజి నారాయణరావు రచనలు ప్రజలలో చైతన్యం రేపాయని, ఆయన సాహిత్యం సమాజానికి దిశానిర్దేశం చేసిందని, అతను ఒక ప్రాంతానికో, ఒక తత్వానికో కట్టుబడని మహా కవియని, అంతకుమించి విశ్వమానవతావాదియని అన్నారు. విశిష్ట అతిథి హనుమకొండ జిల్లా ప్రధాన న్యాయమూర్తి డా. పట్టాభి రామారావు మాట్లాడుతూ కాళోజీ బానిసత్వాన్ని ఎప్పుడూ సహించలేదని, ఆధిపత్యాన్ని ధిక్కరిస్తూ, ఒక్క సిరాచుక్క లక్షలాది మెదళ్లకు కదలిక అంటూ తన రచనల ద్వారా చైతన్యాన్ని నింపాడని, న్యాయవాదులకు, విద్యార్థులకు కాళోజి స్ఫూర్తి అవసరమని అన్నారు. విశేష అతిథి ప్రొఫెసర్ బన్న ఐలయ్య మాట్లాడుతూ కాళోజి కవిత్వంలోని ప్రజాస్వరం గురించి, కవిత్వంలోని అసమానతల గూర్చి, ప్రజా కవిత్వం గూర్చి పెద్ద పోరాటమే చేశారని అన్నారు. వారు జీవత పర్యంతం ప్రజల పక్షపాతిగా నిలబడి ఆధిపత్య భావాన్ని ,అన్యాయాన్ని సహించని వారి వ్యక్తిత్వం గురించి, తెలంగాణ భాషా ప్రత్యేకత గూర్చి కాళోజీ చేసిన ధిక్కార పోరాటాన్ని సాధికారికంగా విశ్లేషించారు.వరంగల్ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు సుధీర్ వలుస మాట్లాడుతూ కాళోజీ ప్రజలభాషకు అండగా నిలిచి, తెలంగాణ భాషకు పట్టం కట్టినాడని, నా గొడవ అంటూనే నరులందరి బాధను అడుగడుగున నిక్షిప్తం చేసినాడని అన్యాయాలపై అలుపన్నదిలేక తిరుగబడి అహర్నిశలూ మానవతావాదంతో మనుగడ సాగించి తెలంగాణ ప్రజల హృదయాలలో శాశ్వతంగా నిలిచారని అన్నారు. మహాకవిగా, మానవీయుడుగా నిలిచిపోయాడని కొనియాడారు. తెలుగు బాషా దినోత్సవం సందర్భంగా కాకతీయ యూనివర్సిటీ సీనియర్ విశ్రాంత తెలుగు ప్రొఫెసర్ బన్న ఇలయ్యను ఇరు జిల్లాల ప్రధాన న్యాయూర్తులు, బార్ అసోసియేషన్ నాయకులు శాలువాలతో ఘనంగా సన్మానం చేశారు. తెలుగు బాషా విశిష్టతను, భాష లోని కమ్మ ధనాన్ని గుర్తించి కార్యక్రమం ఏర్పాటు చేయడమే కాకుండా నాలాంటి వాళ్ళను సన్మానం చేయడం గొప్పవిషయమని, ఈ సత్కారం నాకు కాదని తెలుగు బాషకని బన్న ఐలయ్య అన్నారు. ఈ కార్యక్రమంలో బార్ కౌన్సిల్ సభ్యులు భైరపాక జయాకర్, వరంగల్ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు మైదం జయపాల్, వరంగల్, హనుమకొండ బార్ ప్రధాన కార్యదర్శులు డి. రమాకాంత్, కొత్త రవి, మహిళా జాయింట్ సెక్రటరీలు నాగేంద్రమణి, రేవూరి శశిరేఖ, వరంగల్ బార్ జాయింట్ సెక్రటరీ ముసిపట్ల శ్రీధర్ గౌడ్, గ్రంధాలయ కార్యదర్శులు గుండా కిషోర్, వెంకటేష్, హనుమకొండ కోశాధికారి చింతా సాంబశివరావు, ఆశీర్వాదం, కార్యవర్గ సభ్యులు ఇజ్జగిరి సురేష్, మద్రి రాజు, ఇరు జిల్లాల బార్ అసోసియేషన్ల సభ్యులతో పాటు ఇరు జిల్లాల న్యాయమూర్తులు, న్యాయవాదులు సహోదర రెడ్డి, తీగల జీవన్ గౌడ్, జలేందర్ రెడ్డి, సాయిని నరేందర్, జన్ను పద్మ, ఉమ గౌడ్, రాగిణి రాజ్ తదితర న్యాయవాదులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# చరిత్రలో ఎప్పటికీ గుర్తుండిపోయే వ్యక్తి కాళోజీ నారాయణ రావు

**- ఆర్.జి-త్రీ జీఎం నరేంద్ర సుధాకరరావు**




**అగ్నిధార న్యూస్ రామగిరి :** తెలంగాణ ప్రజల గుండెల్లో, చరిత్రలో ఎప్పటికీ గుర్తుండిపోయే వ్యక్తి ప్రజాకవి, తెలంగాణ ఉద్యమకారుడు స్వర్గీయ కాళోజీ నారాయణరావు అని రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకరరావు అన్నారు.మంగళవారం జిఎం కార్యాలయం నందు నిర్వహించిన స్వర్గీయ కాళోజీ నారాయణ రావు 111వ జయంతి వేడుకలలో భాగంగా వారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రజల ప్రతి ఉద్యమం ప్రతిధ్వనిగా కొనియాడబడతారని, రాజకీయ సాంఘిక చైతన్యాల సమాహారంగా కవిత్వం రాసిన ప్రజాకవిగా నిలిచారని తెలిపారు.నిజాం దమన నీతికి, నిరంకుశత్వానికి, అరాచక పాలనకి వ్యతిరేకంగా అతను కలమెత్తాడని, స్వాతంత్ర్య సమరయోధుడని, 1992 సంవత్సరంలో భారతదేశ రెండవ అత్యున్నత పౌర పురస్కారం పద్మ విభూషణ్ పొందాడని, అతని జన్మదినాన్ని తెలంగాణ ప్రభుత్వం తెలంగాణ భాషా దినోత్సవంగా చేసి గౌరవించిందని, వారి పేరున ఆరోగ్య విశ్వవిద్యాలయం, కాళోజీ కళాక్షేత్రం ఏర్పాటు చేసి తెలంగాణ సమాజం వారి సేవలను గౌరవించిందన్నారు. తెలంగాణ సాధనకు ఆయన చేసిన కృషి, దృఢ సంకల్పం రాష్ట్ర చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోతాయని అన్నారు.ఈ కార్యక్రమంలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు ఎం.రామచంద్రారెడ్డి, కోట రవీందర్ రెడ్డి, పర్సనల్ విభాగధిపతి బి.సుదర్శనం, సివిల్ డీజీఎం రాజేంద్ర కుమార్, ఏరియా సర్వే అధికారి జనార్ధన రెడ్డి, డిప్యూటీ ఎస్టేట్స్ మేనేజర్ కె.ఐలయ్య తోపాటు వివిధ విభాగాల అధిపతులు, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

http://www.agnidharanews.com
అగ్నిధార
నిజాల నిప్పు కణిక

# గుర్తింపు సంఘంపై కుట్ర

**ఏఐటీయూసీ అధ్యక్షులు సీతారామయ్య.**



**అగ్నిధారన్యూస్,( గోదావరిఖని టౌన్)** సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి)ను బదనాం చేయడానికి కుట్ర జరుగుతుందని ఆ యూనియన్ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు.మంగళవారం గోదావరిఖని భాస్కర్ రావు భవన్ లో జరిగిన యూనియన్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని కార్మిక సంఘాలు పనిగట్టుకుని బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.మారుపేర్ల సమస్య పరిష్కారం ప్రభుత్వం చేతిలో ఉంటే తమ యూనియన్ ఆఫీస్ ముందు ఆందోళన చేయడం సరైంది కాదన్నారు.విజిలెన్స్ కేసుల కార్మికుల డిపెండెంట్ లను కొన్ని కార్మిక సంఘాలు ఉసిగొల్పి యూనియన్ ఆఫీస్ ముందు ధర్నా చేయించడంలో అంతర్యం ఏమిటని ప్రశ్నించారు.మారుపేర్లు,విజిలెన్స్ కేసుల కార్మికుల డి సి పెండెంట్ లకు సింగరేణి లో ఉద్యోగాలు కల్పించే సమస్య ఈనాటిది కాదని,తొమ్మిది సంవత్సరాలుగా ఉందన్నారు.వారికి ఉద్యోగాలు ఇవ్వాలని ఏఐటియుసి గత ప్రభుత్వ హయాంలో టిబిజికేఎస్ గుర్తింపు లో ఉన్నప్పుడు డిమాండ్ చేశామని గుర్తు చేశారు.యాజమాన్యం ఇది లీగల్ సమస్య అని పరిష్కారం కోసం రాష్ట్ర అడ్వకేట్ జనరల్ కు పంపించి ఆరునెలలు గడిచిందని,సమస్య యాజమాన్యం పరిది లో లేదని రాష్ట్ర ప్రభుత్వం పరిధిలో ఉందని,ముఖ్యమంత్రి బిజీ షెడ్యూల్ వల్ల అపాయింట్మెంట్ దొరకక ఆలస్యం జరుగుతుందన్నారు. ఇందులో యూనియన్ నిర్లక్ష్యం ఏం లేదన్నారు.సమస్య పరిష్కారం అవుతుందని ఆయన పేర్కొన్నారు.గుర్తింపు సంఘంగా సింగరేణి లో కొత్త గనులు రావడం,లాభాల్లో వాటా ప్రకటించడం,మారుపేర్లు,విజిలెన్స్ కేసుల కార్మికుల డిపెండెంట్ లకు ఉద్యోగ నియామకాలు తదితర సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపేందుకు ప్రయత్నం చేస్తున్నట్లు చెప్పారు.ఈ సమావేశంలో ఏఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్,బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషం,సిపిఐ నగర కార్యదర్శి కనకరాజు నాయకులు గౌతం గోవర్ధన్,అక్బర్ అలీ,బి.సుదర్శన్,దాసరి శ్రీనివాస్,బలుసు రవి,అజీం పాషా,బుర్ర భాస్కర్ పాల్గొన్నారు.

# కాళేశ్వరం.. జలేశ్వరం!

**జిల్లాలో అడుగిడిన కాళేశ్వరం నీళ్లు**

**ఆలస్యంగానైనా నందిమేడారం, గాయత్రి పంపులను ఆన్ చేసిన అధికారులు**

**కాళేశ్వరం కాదు..కూలేశ్వరమంటూ చేసిన తప్పుడు ప్రచారానికి తెర**

**పంట చేతికి వచ్చేంత వరకు నీళ్లివ్వకుంటే ఆందోళన తప్పదన్న బీఆర్ఎస్**



**సూర్యాపేట :** కాళేశ్వరంలో కొద్దిమేర కుంగిన రెండు పిల్లర్లను సాకుగా చూపుతూ కాళేశ్వరం కూలిపోయింది.. కాళేశ్వరం కాదు..కూలేశ్వరమంటూ చేసిన తప్పుడు ప్రచారానికి తెరపడింది. తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని ఆసియాఖండంలోనే అతిపెద్ద పంపు హౌజ్లైన నందిమేడారం, గాయత్రి పంపులను ప్రభుత్వం ఆన్ చేయడంతో సోమవారం జిల్లాలోకి కాళేశ్వరం జలాలు ప్రవేశించాయి. అయితే ఆ నీళ్లు కాళేశ్వరం ప్రాజెక్టు నీళ్లు కాదని చెబుతున్న నేతలకు అవి ఎక్కడి నుంచి వస్తున్నాయో చెప్పలేని పరిస్థితి నెలకొంది. పోనీ ఉమ్మడి రాష్ట్రంలో ఆ నీళ్లు ఎందుకు రాలేదో చెప్పరు.. చెప్పలేరు. కాగా పంటలు చేతికి వచ్చేంత వరకు నీళ్లు ఇవ్వకుంటే కాంగ్రెస్ భరతం పడతామంటూ బీఆర్ఎస్ హెచ్చరిస్తోంది. కాళేశ్వరం అంటే ఒక్క చోట నిర్మించిన ప్రాజెక్టు కాదు అనేక బ్యారేజీలు, బాహుబలి మోటార్లు, కిలోమీటర్ల మేర టన్నెళ్ల సమూహం ప్రాజెక్టు స్వరూపం పరిశీలిస్తే గోదావరి, ప్రాణహిత నదుల కలయిక అనంతరం సుమారు 30 కిలోమీటర్ల దూరంలో మేడిగడ్డ వద్ద నిర్మించిన బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ మొదటిది. అక్కడి నుంచి అన్నారం, సుందిళ్ల తదనంతరం శ్రీపాద ఎల్లంపల్లి బ్యారేజ్, అక్కడి నుంచి నంది మేడారం రిజర్వాయర్ మీదుగా మిడ్‌మానేరుకు గోదావరి జలాలు చేరుకుంటాయి. తరువాత గ్రావిటీ ద్వారా కాకతీయ మెయిన్ కెనాల్ నుంచి లోయర్ మిడ్ మానేరుకు చేరుకొని నేరుగా బయ్యన్నవాగు ద్వారా సూర్యాపేట జిల్లాలోకి నీళ్లు ప్రవేశిస్తాయి. మొత్తం అన్ని బ్యారేజీలకు కలిపి 227 పిల్లర్లు ఉండగా కేవలం మేడిగడ్డలో కుంగిన రెండు పిల్లర్లను సాకుగా చూపి కాళేశ్వరం కూలిపోయిందంటూ సీఎంతో పాటు మంత్రులు, కాంగ్రెస్ నేతలు చేసిన తప్పుడు ప్రచారం పటాపంచలైంది. ఉమ్మడి రాష్ట్రంలో ఎడారిగా ఉన్న సూర్యాపేట జిల్లాలోని దాదాపు 2.60 లక్షల ఎకరాలు (గోదావరి ఆయకట్టు కింద)కాళేశ్వరం ప్రాజెక్టు వచ్చిన తరువాత 2018 నుంచి 1.25లక్షల ఎకరాలు తుంగతుర్తి నియోజకవర్గంలో, సూర్యాపేట, కోదాడలో కలిసి మరో 1.35 లక్షల ఎకరాలు జిల్లాలో మొత్తంగా 2.60 లక్షల ఎకరాలు కొత్తగా సాగులోకి వచ్చాయి. ఉమ్మడి రాష్ట్రంలో మాత్రం గోదావరి ఆయకట్టు ఏనాడూ 50వేలకు మించి సాగు కాలేదు.

**జిల్లాకు చేరుకున్నవి కాళేశ్వరం జలాలే..**

కాళేశ్వరం కూలిందని ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు నీళ్ల కోసం ఆందోళనలకు దిగుతారనుకున్న ప్రతీసారి మోటార్లు ఆన్ చేస్తోంది. గతేడాది కూడా అదే మాదిరి ఆన్ చేయగా ఇటీవల పదిహేను రోజుల క్రితం కాళేశ్వరం ప్రాజెక్టులోని ఆసియాలోనే అతిపెద్ద పంపులైన నందిమేడారం, గాయత్రి పంపులను ఆన్ చేసి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. మిడ్‌మానేరుకు చేరుకున్న నీళ్లు లోయర్ మానేరు ద్వారా బయ్యన్న వాగుకు చేరుకుని, అక్కడి నుంచి జిల్లాలోకి ప్రవేశించాయి. అయితే మంత్రులు, నాయకులు ఎస్ఆర్ఎస్పీ నుంచి జలాలు వస్తున్నాయంటూ బుకాయిస్తున్నారు.

మరి ఉమ్మడి రాష్ట్రంలో కూడా శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ఉంది కదా.. నాడు ఎందుకు నీళ్లు ఇవ్వలేదంటే మాట మారుస్తున్నారే తప్ప ఏ ఒక్కరు సమాధానం చెప్పడం లేదు. అంతే కాకుండా ఈ వానాకాలం వర్షాలు ఆలస్యంగా కురవడంతో ఇటీవలే నాట్లు పూర్తయ్యాయి. పంట చేతికి వచ్చేంత వరకు మోటార్లు ఆన్ చేసి చెరువులు నింపుతూ నీటిని విడుదల చేయాలని బీఆర్ఎస్ శ్రేణులు డిమాండ్ చేస్తున్నారు. మళ్లీ పంటలను ఎండబెట్టాలని చూస్తే రైతులకు మద్దతుగా తాము కాంగ్రెస్ ప్రభుత్వంపై సమరశంఖం పూరించి అవసరమైతే పంపులను తామే ఆన్ చేస్తామని హెచ్చరిస్తున్నారు.

**వెలిశాల వద్ద జిల్లాలోకి ప్రవేశించిన గోదావరి జలాలు..**

జనగామ జిల్లా కొడకండ్ల మండలం బయ్యన్నవాగు రిజర్వాయర్ ఫేజ్ 2 ,నుంచి గోదావరి జలాలను తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ సోమవారం నీటి పారుదల శాఖ అధికారులతో కలిసి విడుదల చేశారు . ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు వానాకాలం 94 వేల ఎకరాలకు సాగు నీరు అందుతుందని అన్నారు. దిగువ నుంచి ఎగువకు నీరు విడుదల చేయడంతో జిల్లా వ్యాప్తంగా ఉన్న 650 పై చిలుకు చెరువులు ,కుంటలతో పంటపొలాలు సస్యశ్యామలం కానున్నాయన్నారు. కాగా జిల్లాలోని ఎస్సారెస్పీ కాల్వలున్న తుంగతుర్తి, నాగారం, అర్వపల్లి, మద్దిరాల, సూర్యాపేట, చివ్వెంల ,కోదాడ మండలాల్లో భూగర్భ జలాలు పెరిగి వానాకాలం పంట చేతికి అందనుందని పేర్కొనారు.

# వారిద్దరిని మిస్ అవ్వడం లేదు..అన్నింటికీ మేము రెడీ: పాక్ కెప్టెన్

ఆసియాకప్-2025కు రంగం సిద్ధమైంది. అబుదాబి వేదికగా మరి కొన్ని గంటల్లో అఫ్గానిస్తాన్-యూఏఈ మ్యాచ్‌తో ఈ మెగా టోర్నీకి తెరలేవనుంది. అయితే ఈ ఖండాంతర టోర్నమెంట్ ఆరంభానికి ముందు మొత్తం 8 జట్ల కెప్టెన్‌లు విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా పాకిస్తాన్ కెప్టెన్ సల్మాన్ అలీ అఘా ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. స్టార్ ప్లేయర్లు బాబర్ ఆజం, మహ్మద్ రిజ్వాన్ జట్టులో లేకపోవడం తమకు ఎటువంటి నష్టం కలిగించదు సల్మాన్ చెప్పుకొచ్చాడు. కాగా గత కొంత కాలంగా బాబర్, రిజ్వాన్ పేలవ ప్రదర్శన కనబరుస్తుండడంతో ఆసియాకప్‌కు సెలక్టర్లు చేయలేదు. సెలక్టర్ల నిర్ణయాన్ని చాలా మంది తప్పు బట్టారు. కాగా ఇటీవల కాలంలో పాక్ ఈ ఇద్దరు దిగ్గజ క్రికెటర్లు లేకుండా ఓ మల్టీనేషనల్ టోర్నమెంట్‌లో పాల్గొంటుండడం ఇదే తొలిసారి "ప్రస్తుతం మా జట్టు చాలా బాగుంది. గత నాలుగు సిరీస్‌లలో మేము మూడింట మేము విజయం సాధించాము. అన్ని విభాగాల్లోనూ మేము మెరుగ్గా రాణిస్తున్నాము. ఏదేమైనప్పటికి ఆసియాకప్ మాకు ఒక కఠిన సవాల్ వంటిది. ఎందుకంటే మా జట్టులో చాలా మంది ఆటగాళ్లు తొలిసారి ఒక ప్రధాన టోర్నమెంట్‌లో ఆడనున్నారు. ఈ సవాల్‌ను ఎదుర్కొనేందుకు మేము సిద్ధంగా ఉన్నాము. టీ20 క్రికెట్‌లో ఏ జట్టు ఫేవరేట్ కాదు. తమదైన రోజున ప్రతీ జట్టు అద్భుతాలు చేస్తోంది. ఒకట్రెండు ఓవర్లలో మ్యాచ్ స్వరూపమే మారిపోతుంది. ఈ టోర్నీకి ముందు ముక్కోణపు సిరీస్‌ను మేము సన్నాహకంగా ఉపయోగించుకున్నాము.

సిరీస్‌ను గెలిచినందుకు సంతోషంగా ఉన్నాము" అని సల్మాన్ పేర్కొన్నాడు. కాగా ఈ మల్టీనేషన్ టోర్నమెంట్‌కు ముందు పాక్ జట్టు యూఏఈ, అఫ్గానిస్తాన్‌లతో ట్రైసిరీస్‌లో తలపడింది. ఫైనల్లో అఫ్గానిస్తాన్‌ను చిత్తు చేసి పాక్ ట్రైటిల్‌ను సొంతం చేసుకుంది. ఇప్పుడు అదే జోరును ఆసియాకప్‌లోనూ కనబరిచాలని మెన్ ఈన్ గ్రీన్ భావిస్తుంది. ఈ ఖండాంత టోర్నీలో పాక్ జట్టు తమ తొలి మ్యాచ్‌లో సెప్టెంబర్ 12న ఒమన్‌తో తలపడనుంది. అనంతరం సెప్టెంబర్ 14న టీమిండియాతో అమీతుమీ తెల్చుకోనుంది.




**పాకిస్తాన్ జట్టు**

సల్మాన్ అలీ అఘా (కెప్టెన్), అబ్రార్ అహ్మద్, ఫహీమ్ అష్రఫ్, ఫఖర్ జమాన్, హారీస్ రౌఫ్, హసన్ అలీ, హసన్ నవాజ్, హుస్సేన్ తలాత్, ఖుష్దిల్ షా, మహ్మద్ హారీస్ (వికెట్-కీపర్), మహ్మద్ నవాజ్, మహ్మద్ వసీమ్ జూనియర్, సాహిబ్‌జాదా ఫర్హాన్, సయీమ్ అయూబ్, సల్మాన్ మీర్జా, షాహిన్ అఫ్రిది, సూఫియాన్ మొకిమ్

# నరకప్రాయంగా రహదారులు


**వరదతో సంభవించిన నష్టం అపారం..**

**ఇప్పటికీ కళ్లు తెరవని కాంగ్రెస్ ప్రభుత్వం..**

**కామారెడ్డి జిల్లాలో రూ.130కోట్ల రోడ్ల డ్యామేజి..**

**నిజామాబాద్‌లో 5 మండలాల్లో దెబ్బతిన్న బీటీ రోడ్లు..**

**ప్రత్యేక ప్యాకేజీ కింద నిధులిస్తేనే రోడ్లకు పూర్వ వైభవం సాధ్యం..**



**నిజామాబాద్ :** ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో వరద సృష్టించిన విలయ తాండవానికి భారీ ఎత్తున రోడ్లు ధ్వంసమయ్యాయి. బీటీ రోడ్లు నామరూపాల్లేకుండా కొట్టుకు పోవడంతో వాహనాల రాకపోకలు నిలిచి పోయాయి. ప్రస్తుతం నడక కూడా నరకప్రా యంగా మారింది. కంకర తేలిన రోడ్లపై టూ వీలర్, ఫోర్ వీలర్లతో ప్రయాణించడం గగనమైంది. ఆర్టీసీ బస్సు సర్వీసులు ఇప్పటికే పలు చోట్ల పునరుద్ధరణకు నోచు కోలేదు. నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా 5 మండలాల్లో ఆర్ అండ్ బి, పంచాయతీ రాజ్ రోడ్లు తీవ్రంగా నష్టం సంభవించింది. వీటి విలు రూ.20కోట్లు వరకు ఉంటుందని ప్రాథమిక అంచనాలు చెబుతున్నాయి. కామారెడ్డి జిల్లాలో వంతెనలతో సహా జాతీయ, రాష్ట్ర రహదారులు నామరూపాల్లేకుండా పోవడంతో నష్టం భారీగా ఏర్పడింది. కామారెడ్డి జిల్లాలో రోడ్లు భవనాల శాఖ(ఆర్ అండ్ బి) రోడ్లు 65 కిలో మీటర్ల మేర ధ్వంసం అయ్యాయని అంచనాలు సిద్ధమయ్యాయి. 48 కల్వర్టులు తీవ్ర స్థాయిలో దెబ్బతిన్నాయి. వీటి మొత్తం విలువ సుమారుగా రూ.130 కోట్లు ఉంటుందని ఆర్ అండ్ బి అధికారులు అంచనా వేస్తున్నారు. ఇనేక చోట్ల ప్రస్తుతం తాత్కాలిక మరమ త్తులు చేస్తున్నారు. బీటీ రోడ్లు దెబ్బతిన్న చోట మట్టి పోసి రాకపోకలకు అనువుగా మార్చుతున్నారు. వానలు లేకపోవడంతో ప్రస్తుతం పరిస్థితి అదుపులో ఉంది. 11 రోజులవుతోన్న ఇప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని వీడలేదు. ముఖ్యమంత్రి పర్యటించి వెళ్లినప్పటికీ అంచనాల రూపకల్పనలోనే అధికార యంత్రాంగం నిమగ్నం అవ్వడం విడ్డూరంగా మారింది. సీఎం పర్యటనలో ప్రత్యేక ప్యాకేజీ కింద నిధులు వస్తాయని అంతా భావించారు. కానీ అలాంటిదేమీ లేకుండా పోయింది.

**నిజామాబాద్‌లో 5 మండలాల్లో దెబ్బతిన్న రోడ్లు**

నిజామాబాద్ జిల్లాలో వరద సృష్టించిన విధ్వంసంలో ప్రధానంగా 5 మండలాల్లో అస్తవ్యస్త పరిస్థితులు నెలకొన్నాయి. బోధన్, భీంగల్, ధర్పల్లి, సిరికొండ, ఇందల్వాయి మండలాల్లో వరద ఉధృతికి ఆర్అండ్‌బి, పీఆర్ రోడ్లు చిన్నాభిన్నమయ్యాయి. పలు చోట్ల కోతకు గురవ్వడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. నేటికీ భారీ వాహనాలు వెళ్లడం ఇబ్బందిగానే మారింది. ఇందల్వాయి మండలంలో జాతీయ రహదారి 44 -గన్నారం, తిర్మన్‌పల్లి రాంపూర్, తిర్మన్‌పల్లి - ధర్పల్లి, ఎల్లారెడ్డిపల్లి - లోలం, అన్సన్‌పల్లి - సిర్నాపల్లి రోడ్లు ధ్వంసమయ్యాయి. నష్టం విలువ రూ.1కోటి వరకు ఉంటుందని అంచనా. సిరికొండ మండలంలో రూ.4కోట్లు మేర రోడ్లు కోతకు గురయ్యాయి. పెద్దవాల్గోట్ -చిన్నవాల్గోట్, తూంపల్లి - భీంగల్, సిరికొండ - వేములవాడ, హొన్నాజిపేట్ -కొండాపూర్, ధర్పల్లి - భీంగల్ మధ్య సమస్య ఏర్పడింది. ధర్పల్లి మండలంలో సుమారుగా రహదారులకు రూ.2కోట్లు నష్టం వాటిల్లింది. మద్దుల్ ఎక్స్ రోడ్డు - గడ్కోల్, హొన్నాజిపేట్ - బీరప్పాతండా -కొటాలపల్లి, ఇందల్వాయి - భీంగల్, ఎల్లారెడ్డిపల్లి -ప్రాజెక్టు రామడుగు, ప్రాజెక్టు రామడుగు - కేసారం దుబ్బాక -రేకులపల్లి పోతునూర్, యానంపల్లి -ప్రాజెక్టు రామడుగు వరకు డ్యామేజీ చోటు చేసుకుంది. బోధన్ పాత మండలం పరిధిలో సిద్ధాపూర్ - ఖండ్గామ్, హంగర్గా -కొప్పర్గా, హున్సా గ్రామంలో అంతర్గత రోడ్లు దెబ్బతిన్నది. భీంగల్ మండలంలో రూ.3కోట్లు వరకు కిలోమీటరన్నర వరకు ఆర్ అండ్ బి బీటీ రోడ్డు నష్టం వాటిల్లగా, పంచాయతీ రాజ్ పరిధిలో రూ.1కోటి వరకు మూడు కల్వర్టులు, పలు చోట్ల రోడ్లు ధ్వంసమయ్యాయి.

**కామారెడ్డిలో అపారనష్టం**

నాగిరెడ్డిపేట మండలంలో పోచారం, బంజారా గ్రామాల మధ్య జాతీయ రహదారి 765డి కొట్టుకు పోయింది. దీంతో హైదరాబాద్ ప్రయాణాలు కష్టమవ్వగా తాత్కాలికంగా మట్టి రోడ్డుతో రాకపోకలకు ఏర్పాట్లు చేశారు. చీనూర్ గోపాల్‌పేట బీటీ రోడ్డు, గోపాల్‌పేట-నాగిరెడ్డిపేట, వెంకంపల్లి-ధర్మారెడ్డి మధ్య తీవ్రంగా రోడ్లు దెబ్బతిన్నాయి. బీబీపేట మండలంలో జనగామ-మాందపూర్, బీబీపేట-ఉప్పరపల్లి, తుజాల్‌పూర్- బీబీపేట, యాడారం-బీబీపేట,జనగామమద్రి-అంబారిపేట, మాందాపూర్ -సంగమేశ్వర్ మధ్య ఘోరమైన దుస్థితి ఉంది. మాచారెడ్డి మండలంలో పాల్వంచ -దోమకొండ, భవనానిపేట-పోతారం-సింగారాయపల్లి, పాల్వంచ-ఓఫరీద్‌పేట, చుక్కాపూర్-బండరామేశ్వరపల్లి, లచ్చాపేట-బండరేమేశ్వరపల్లి, పాల్వంచ బ్రిడ్జి ధ్వంసమైంది. రాజంపేట మండలంలో కొండాపూర్-ఆరుగొండ, కొండాపూర్ నుంచి ఎల్లారెడ్డిపల్లి మార్గంలో మధ్య రెండు బ్రిడ్జిలు దెబ్బతిన్నాయి. రాజంపేట-పెద్దాయపల్లి, రాజంపేట- శివాయిపల్లి మధ్య కోసుకపోయిన రోడ్లు. భిక్కనూర్ మండలంలో భిక్కనూర్-అంతంపల్లి, భిక్కనూర్- లక్ష్మీదేవిపల్లి, భిక్కనూర్ గుర్జాకుంటా మధ్య ఇబ్బందికర పరిస్థితి ఏర్పడింది. లింగంపేట మండలంలో పాముల వాగు వంతెన కొట్టుకుపోవడంతో రాకపోకలు మెరుగుపడలేదు. కాసులకట్ట వంతెన, పోల్కంపేటలో లో లెవెల్ బ్రిడ్జి దెబ్బతిన్నది. నిజాంసాగర్ పాత మండలంలో బొగ్గుగుడిసె వద్ద రోడ్డు తీవ్రంగా ధ్వంసమవ్వడంతో హైదరాబాద్ బోధన్ బస్సులు నిలిచిపోయాయి. మంజీరా నదిపై చిన్నాపూర్ వద్ద వంతెన కొట్టుకు పోయింది. ఎల్లారెడ్డి మండలంలో కామారెడ్డి వెళ్లే దారిలో పోచంపల్లి శివారు, అడవిలింగాల శివారు, కొట్టాల్ వద్ద రోడ్డు తెగి పోగా మట్టితో చక్కబెట్టారు. బిచ్కుంద మండలంలో బండరెంజల్ శాంతాపూర్, చిన్నదేవడ గేట్ చిన్నదేవడ డ్యామేజీ చోటు చేసుకుంది. చిన్నదడ్గి పెద్ద దడ్గి బ్రిడ్డిపై చువ్వలు తేలాయి.

# నిరసన .. నిరీక్షణ.. నిర్లక్ష్యం..



**గన్నేరువరం/చిగురుమామిడి:** యూరియా కోసం రైతుల పాట్లు తప్పడం లేదు. గన్నేరువరం గుండ్లపల్లిలో యూరియా టోకెన్ల కోసం సోమవారం ఎరువుల దుకాణం వద్ద క్యూ కట్టారు. 230బస్తాలకు టోకెట్లు ఇచ్చి, యూరియా పంపిణీ చేశారు. 70 మంది రైతులకు నిరాశే మిగిలింది. చిగురుమామిడి మండలం ఇందుర్తిలో యూరియా కోసం రైతులు ఉదయం నుంచి సాయంత్రం వరకు క్యూలైన్‌లో వేచి ఉన్నారు. 500 యూరియా బస్తాలు రాగా, వెయ్యి మంది రైతులు క్యూలో నిల్చున్నారు. తిమ్మాపూర్ సీఐ సదన్‌కుమార్, చిగురుమామిడి ఎస్సై సాయికృష్ణ పర్యవేక్షణలో టోకెన్లు జారీ చేసి, యూరియా పంపిణీ చేశారు. బస్తాలు అందనివారు నిరాశతో వెనుదిరిగారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ అమలు చేయకుంటే గద్దె దింపుతామని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి అనిల్, వికలాంగుల హక్కుల పోరాట సమితి నాయకుడు శ్రీనివాస్ హెచ్చరించారు. వృద్ధులు, దివ్యాంగులు, వితంతువుల పెన్షన్లు పెంచకపోవడాన్ని నిరసిస్తూ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం వృద్ధులు, దివ్యాంగులతో కలిసి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. వృద్ధులు, దివ్యాంగుల పెన్షన్లు పెంచాలని డిమాండ్ చేశారు. రెండేళ్లుగా ఇచ్చిన హామీలు అమలు చేయకుండా సర్కారు దగా చేస్తోందని ఆరోపించారు. ఇప్పటికైనా ఇచ్చిన మాట నిలుపుకోవాలన్నారు.

Printed Published Edited and Owned by Chegonda Ravikumar Yadav.Printed at Sri Laxmi Printing Press H.NO.4_6_157 Peddapalli Pin co.505172 State Telangana
TITLE CODE:TELTEL02040 EDITOR: Chegonda Ravikumar Yadav Contact Number.8008817828. Email.agnidharanews@gmail.com http://www.agnidharanews.com